

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6.22 బుధవారం సాయంత్రం
సహర్: 4.49 గురువారం ఉదయం

పూతరేకుల్లో కల్తీనెయ్యి
» కేసులు నమోదు చేస్తాం : ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ 7

రాజమండ్రికి చెందిన ఓ కాంట్రాక్టరు ఫేస్ బుక్ చూస్తూ ఓ యాడ్‌పై క్లిక్ చేశా డు. ఇంకేముంది..తక్కువ సమయంలో కోట్లు సంపాదిం చవచ్చని కనబడింది. యాప్ డౌన్‌లోడ్ చేసు కున్నాడు. ముందు కొంత సొమ్ము పెట్టుబడి పెట్టాడు. రెట్టింపు వచ్చినట్టు యాప్‌లో చూపించింది. ఎప్పుడైతే యాప్‌లో తన వివరాలను నమోదు చేశాడో ఇతడి క్రెడిట్ కార్డుల నెంబర్లు, పిన్‌లతో సహా అవతలి వ్యక్తులకు వెళ్లిపోయాయి. మూడు రోజుల్లో అవి ఉపయోగించి రూ.50 లక్షలు దోచేశారు. యాప్ పని చేయడం ఆగిపోవడంతో మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.

కాకినాడ జగన్నాథపురానికి చెందిన ఓ యువకుడు ఈజీగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ మాత్రమే ఆదాయ మార్గమని తన స్నేహితుడి ద్వారా తెలుసుకున్నాడు. వెంటనే యాప్‌లను డౌన్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. మొదట రూ.20 నుంచి మొదలు పెట్టిన ఈ ఆటకు అంతే లేకుండా పోయింది.అప్పులు చేసి మరీ ఈ బెట్టింగ్ యాప్‌ల్లో ఆడాడు.. తీవ్రంగా నష్టపోయాడు. తనకున్న సొంతింటిని అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

సామర్లకోట మండలం వేట్లపాలెంలో రెవె న్యూ శాఖలో పనిచేస్తున్న ఒక మహిళా సిబ్బంది భర్త ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు.తన భార్య బంగారు ఆభరణాలను తాకట్టుపెట్టి మరీ బెట్టింగ్ కాసి ఉన్నదంతా పోగొట్టుకున్నాడు.ఏమీ చేయలేని నిస్సహాయతతో ఇంటికి వెళ్లే ధైర్యం లేక అజ్ఞాతంలోకి వెళ్లాడు.

కాకినాడకు చెందిన ఒక యువకుడు (20) టైల్స్ షాపులో పనిచేసేవాడు. అతను ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. ఆన్‌లైన్‌లోనే అప్పుల పాలయ్యాడు.. చివరకు తీర్చేదారిలేకపోయింది. ఒక రోజు ఇంటికి వచ్చి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు.. చనిపోయిన తరువాత అతడు సెల్‌ఫోన్ చూస్తే అంతా తెలిసింది.

ప్రాణాలతో.. సెలగాటం!



పరీమ్యాచ్, బెట్ 365, డ్రాఫ్ట్‌కింగ్స్, ఫాన్ డ్యూయల్, 1ఎక్స్‌బెట్, బెట్‌ఎంజీఎం, టాజ్777, టార్గెట్‌గేమ్స్.. ఇవన్నీ ఏంటో అనుకుంటున్నారా.. బెట్టింగ్‌ల యాప్‌ల పేర్లు.. 'వీటిలో జస్ట్ కొద్దిగా డబ్బులు పెట్టండి.. వెలకమ్ బోనస్ వస్తుంది..' అంటూ సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూ యెన్సర్స్‌తో యాప్‌ల ప్రమోషన్లు చేసి యువతను టెంప్ట్ చేస్తారు.వీటి మాయలో పడిన యువత త్వరగా డబ్బు సంపాదించాలనే కోరికతో డబ్బులు పెట్టీ.. పెట్టీ.. పెట్టీ నష్టపోతున్నారు. అప్పులపాలవుతున్నారు.. చేసిన తప్పును ఎవరికీ చెప్పుకోలేక..ఆ నరకం నుంచి బయటపడలేక ఆత్మహత్య చేసుకోవడమో.. అదృశ్యం కావడమో చేస్తున్నారు.. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లు చేస్తున్న కొందరు ఇన్‌ఫ్లూ యన్సర్లపై తెలంగాణ పోలీసులు కేసులు నమోదు చేశారు. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లో ఈ యాప్‌ల బారినపడి నలిగిపోతున్న యు వత పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

(రాజమహేంద్రవరం/కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చోరీ కేసులు, గంజాయి రవాణా వంటి నేరాల వెనుక ఆన్‌లైన్ బెట్టింగ్ బూచీ లింక్ అయి ఉంటోంది. నేరాలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువగా యువత, నడి వయస్కులు ఉంటున్నారు. వీళ్లు నేరాల ద్వారా సంపాదించిన సొమ్మును బెట్టింగ్‌లకు వెచ్చిస్తున్నారు. లేదంటే బెట్టింగ్‌ల వల్ల అప్పులపాలై వాటిని తీర్చడానికి వక్రమార్గాన్ని అనుసరిస్తున్నారు. కొంత మంది ప్రాణాలు తీసుకుంటున్నారు. సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు కాసుల కక్కుర్తితో ఇస్తున్న ప్రకటనలు మరింత కీడు చేస్తున్నాయి.ఆస్తులు అమ్ముకొని బికారులుగా మిగిలినవాళ్లు, అప్పులు తీర్చడానికి దొంగలుగా మారినవారు ఎంతో మంది. బెట్టింగ్ యాప్‌లు ప్రాణాలు తీసిన ఘటనలెన్నో. ఇవేవీ బయటకు రావు..పోలీసు కేసుల్లో నమోదు కావు.

విద్యార్థులు, ఉద్యోగులు..

బెట్టింగ్ యాప్‌ల వలలో స్టూడెంట్స్, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల వాళ్లూ పడుతున్నారు. ముందు సరదాగా మొదలుపెట్టినా తర్వాత వ్యసనంగా మారిపోతోంది. బెట్టింగ్ యాప్‌ల వలలో ఎక్కువగా చదువుకున్న వారే ఉంటుండడం ఆందోళన కలిగిస్తోందని సర్వేలు చెబుతున్నాయి. ఏఐ సాంకేతికత, ఆల్గారిథమ్స్ వంటి అధునాతన టెక్నాలజీలతో యాప్‌లు తయారు చేస్తుండడంతో యాడ్‌ల రూపంలో ఎలాగైనా డబ్బు సంపాదించాలనే బలహీనతను అవి క్యాష్ చేసుకుంటున్నాయి. యాప్‌ల వలలో పడి నష్టపోతున్న వారు కోకొల్లలు.వీరిలో 99 శాతం మంది పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. మరో వైపు పోలీసులు పట్టించుకోవడంలేదు . బెట్టింగ్ యాప్‌లపై చైతన్యం తీసుకురాలేకపోతున్నారు. దాదాపు 90 శాతం మంది విద్యార్థులు, ఖాళీ సమయం దొరికేవాళ్లు బెట్టింగ్ యాప్‌లపై మొగ్గు చూపుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో క్రికెట్ బెట్టింగ్‌లకు ఏకంగా ఒక కార్యాలయమే తెరిచేశారంటే పోలీసుల నిఘా ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తూర్పు గోదావరిలో 2023లో నిడదవోలు, బొమ్మూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేవలం రెండు క్రికెట్ బెట్టింగ్ కేసులు మాత్రమే నమోదు కాగా..2024లో ఒక్క కేసూ నమోదు కాలేదు. 2025లో రాజానగరంలో ఒక్క కేసు నమోదైంది. వాస్తవానికి బెట్టింగ్ యాప్‌ల గురించి యాడ్‌లు ఇచ్చినా..వాటిని ప్రమోట్ చేసినా పోలీసులు కేసులు పెట్టవచ్చు.కానీ ఆ దిశగా ఇప్పటి వరకూ ఉమ్మడి జిల్లా లో ఒక్క ప్రయత్నమూ లేదు.

యాప్‌ల...ట్రాప్‌లో జీవితాలు నాశనం



స్మార్ట్‌ఫోన్‌లోనే అన్నీ..

నేటి సాంకేతిక యుగంలో బెట్టింగ్ స్మార్ట్ ఫోన్‌లోకి వచ్చేయడంతో యువత ఆసక్తి చూపుతున్నారు. కలర్ ప్రిడిక్షన్, నెంబర్ ప్రిడిక్షన్.. క్రికెట్, కాసినో.. ఇలా అనేక రకాల విదేశీ యాప్‌లు అందుబాటులోకి రావడంతో ఈజీగా డబ్బులు సంపాదించొచ్చనే ఆశతో డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు.ఎక్కువగా ఉమ్మడి జిల్లాల్లోని గ్రా మీణ యువత వీటి బారినపడి నలిగిపోతున్నారు.

నాడు వైసీపీ నేతల దందా..

ఐపీఎల్, టీ 20 వంటి ఇతర సీజన్ల సమయంలో క్రికెట్ బెట్టింగ్ యథేచ్ఛగా సాగుతోంది. కాకినాడ కేంద్రంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ బెట్టింగ్ భారీగా సాగింది. స్థానిక వైసీపీ నాయకుడి ముఖ్య అనుచరులే ఈ బెట్టింగ్ కార్యకలాపాలకు మధ్యవర్తులుగా ఉండి నిర్వహించేవారు. లక్షలాది రూపాయలు పందేలు కాసిన వారెందరో ఈ క్రికెట్ బెట్టింగ్ బారిన పడి అప్పులపాలై నట్టు తెలుస్తోంది. అప్పట్లో ఎవరూ దీనిపై ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాలేని పరిస్థితి.ప్రత్యేకంగా బుకీలను ఏర్పాటు చేసుకుని మరీ గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారాన్ని నడిపిన కొందరు కోట్లు సంపాదిస్తున్నారు. ఈ తరహా ఇతర ప్రాంతాల్లో కూడా కొందరు వెనకుండి యాప్‌లను నిర్వహిస్తూ యువతను బెట్టింగ్ మాయలోకి దింపుతున్నారు.

- బెట్టింగ్ యాప్‌లపై ఆసక్తి
- సోషల్‌మీడియాలో ప్రమోషన్లు
- ఇన్‌ఫ్లూయెన్సర్స్‌తో ప్రచారం
- వలలో పడుతున్న జనం
- ఈజీ మనీ కోసం వెంపర్లాట
- నష్టపోయినా..ఆగని వేట
- తీరని అత్యాశతో అప్పులు
- నిండా మునుగుతున్న వైనం
- ఎవరికీ చెప్పుకోలేక ఆత్మహత్య
- గుట్టుగా బెట్టింగ్ వ్యాపారాలు
- తెలంగాణలో కేసులు నమోదు
- ఉమ్మడి జిల్లాల్లో పట్టని పోలీసులు



మనోళ్లే..క్రికెట్ బుకీలుగా..

రాయవరం: ఈ నెల 3న జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఇండియా-ఆస్ట్రేలి యా లీగ్ మ్యాచ్‌పై రాయవరం మండలం సోమేశ్వరం, రాజానగరం మండలం చక్రద్వారబందంలో ఆరుగురు క్రికె ట్ బుకీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.4 ల్యాప్‌టాప్‌లు,50 సెల్‌ఫోన్లు, రెండు ఎల్‌ఈడీ టీవీలు, రెండు లైన్‌బాక్స్‌లు,రూ.7.38 లక్షల నగదు కలిగిన బ్యాంక్ ఖాతా ఫ్రీజ్‌చేశారు.

రాజానగరం : తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధం బ్రిడ్జి కౌంటీలోని బి-12 విల్లాలో దుబాయ్ కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్టు పోలీసులు నిర్ధారించారు. కర్ణాటక,భీమవరానికి చెందిన 12 మందిని అరెస్టు చేశారు.ఈ ముఠాలో భీమవరానికి చెందిన వినీత్ దుబాయ్ వెళ్లి అక్కడి నుంచి పలు రకాల పేర్లతో వెబ్‌సైట్లను నిర్వహిస్తున్నట్టు తెలు సుకున్నారు. ఇటీవల ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహిస్తుండగా అరెస్టు చేశారు.

ప్రతి మంగళవారం
స్పెషల్‌డ్రైవ్
» అన్నవరం దేవస్థానంలో జిల్లా కలెక్టర్ పరిశీలన 7
» అపరిశుభ్ర వాతావరణంపై అసహనం
» సత్యనికేతన్ సత్రం ఘటనపై త్వరలో చర్యలుంటాయని వెల్లడి

సత్యదేవుని ఆభరణాలను అప్పగించిన పూర్వపు ఈవో 7

కాకినాడలో.. కోర్ట్ చిత్ర యూనిట్ సందడి 6



హీరో రోషన్, హీరోయిన్ కాకినాడకు చెందిన శ్రీదేవి

22లోపు భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 18(ఆంధ్రజ్యోతి): భూముల క్రమబద్ధీకరణకు ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటనలో విడుదల చేశారు. జిల్లాలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు ఈనెల 22లోగా సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేస్తామన్నారు. క్రమబద్ధీకరణకు మేరకు లబ్ధిదారులకు పట్టా, కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు జారీ చేస్తామన్నారు. 2019, అక్టోబరు 15ను ప్రమాణిక తేదీగా తీసుకుని ఆ తేదీ కంటే ముందు ఆక్రమణల్లో ఉన్న భూములను నిబంధనలు అనుసరించి క్రమబద్ధీకరిస్తామన్నారు. 150గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజు సైతం చెల్లించక్కర్లేదన్నారు. దారిద్ర్య రేఖకు దిగువను ఉండే 151 నుంచి 300 గజాల లోపు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50శాతం చెల్లించాలన్నారు. దారిద్రరేఖకు ఎగువన ఉన్నవారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. 300నుంచి 450గజాల పరిధిలో బీపీఎల్ కుటుంబాల వారు వందశాతం బేసిక్ ధర 50శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఇదే విభాగంలో దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నవారు 200శాతం బేసిక్ ధర, పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు కట్టాల్సి ఉంటుందన్నారు. 450 గజాలకు మించిన ఆక్రమణలో ఎవరు ఉన్నా బేసిక్ ధరకు ఐదు రెట్లు, వందశాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుందన్నారు. అందుకు సిద్ధంగా లేకపోతే ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకుంటుందన్నారు. లేఅవుట్ స్థలాలు, కాలువలు, నదీప్రవాహగట్లు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమబద్ధీకరణ చేయబోరన్నారు. లబ్ధిదారులు, కుటుంబసభ్యులు ఐటీ చెల్లింపు దారై ఉండకూడదన్నారు. నాలుగుచక్రాలు వాహనం ఉండకూడదన్నారు. గ్రామాల్లో నెలకు రూ.10వేలు, పట్టణాల్లో రూ.14వేలు ఆదాయం ఉన్నవారు దీనికి అర్హులుగా నిర్ణయించగా నెలకు రూ.300లోపు విద్యుత్తు ఛార్జీల చెల్లింపు ఉండాలన్నారు. మెట్ట, మగాణి కింద కలిపి పది కరాలకు మించకూడదన్నారు. ఆస్తిపన్ను చెల్లింపు, విద్యుత్తు బిల్లు, వాటర్ బిల్లులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఇప్పటికే స్వీకరించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. జిల్లావ్యాప్తంగా తహసీల్దార్ల పర్యవేక్షణలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఆక్రమణలు జరిగిన ప్రాంతాలు పరిశీలిస్తారన్నారు.

కాకినాడ తీరంలో సైనిక విన్యాసాలు
» వచ్చేనెల 8 నుంచి నిర్వహణ
» భారత్, అమెరికా వాయుసేన దళాలు ఉమ్మడిగా.. 6
» జిల్లా డీఆర్వో వెంకట్రావు వెల్లడి

నేర పరిశోధనలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాలి
» ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్
» అమలాపురం పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల పరిశీలన 6

ప్రజా ఫిర్యాదుల అర్జీలను.. త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అందించిన అర్జీలను నాణ్యమైన పరిష్కారాలు అందించి లబ్ధిదారుల సంతృప్తి స్థాయిని పెంచే దిశగా అధికారులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించారు. గ్రామ స్థాయిలో సచివాలయం సిబ్బంది అర్జీదారుడి గృహాలకు వెళ్లి తెలుసుకుంటున్న అభిప్రాయ సేకరణ వివరాల పురోగతిపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో జేసీ రాహుల్‌మీనా, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల వ్యవస్థకు వచ్చే అర్జీదారుల మొబైల్‌కి ఫీడ్‌బ్యాక్‌లు పంపిస్తామన్నారు. దీనిపై హౌస్‌హోల్డ్‌కు సంబంధించిన అధికారులు అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. అందే అర్జీల్లో ఎక్కువశాతం భూవివాదాలతో కూడిన రెవెన్యూ అంశాలే ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో తహసీల్దార్లు రీసర్వే ఇతర భూఅంశాలపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. అర్జీదారుడి సమస్యకు క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఒకవేళ ఆ సమస్యపై అర్జీదారుడు అసంతృప్తి వ్యక్తం చేస్తే అందుకుగల కారణాలను ఆయా అర్జీదారుల గృహాల వద్దనే తెలుసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకట్రావు, కాకినాడ, ఆర్డీవో మల్లిబాబు, పాడా పీడీ చైత్రవర్షిణి, సీపీవో త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నేరం

» కాకినాడ మూడో సెషన్స్ అడిషనల్ జిల్లా జడ్జి కమలాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి కమలాదేవి

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 18(ఆంధ్రజ్యోతి): గర్భస్థ పిండలింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని కాకినాడ మూడో సెషన్స్ అడిషనల్ జిల్లా జడ్జి కమలాదేవి అన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం వైద్యఆరోగ్యశాఖ, రెవెన్యూ, స్త్రీశిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జిల్లాస్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం తప్పకుండా పాటించాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో రిజిస్టర్లు, ఫారంఎఫ్ కన్సెంట్ తప్పని సరిగా అమలు చేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ స్కాన్ సెంటర్లలో ఈ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నరసింహనాయక్, కాకినాడ జీజీహెచ్ ఫోరెన్సిక్ హెచ్‌వోడీ ఉమా మహేశ్వరరావు, డీఐవో సుబ్బరాజు, పి.సరిత ఆకస్మిక తనిఖీలు, డెకాయ్ ఆపరేషన్లు చట్టప్రకారం చేస్తున్నామన్నారు. భాస్కర్‌రావు, రమేష్, స్వప్న, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మంచినీటికి.. వేసవి కార్యాచరణ

» కాకినాడ కార్పొరేషన్‌లో రూ.1.34కోట్లతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం
» వేసవి జలాశయాల్లో సమృద్ధిగా నీరు



కాకినాడలోని జలాశయంలో సమృద్ధిగా ఉన్న తాగునీరు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎండాకాలంలో గ్రామాలతోపాటు మున్సిపాల్టీల్లో కూడా మంచినీటి సమస్య తప్పడం లేదు. వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన కార్యాచరణకు కాకినాడ నగరపాలక సంస్థ సిద్ధమైంది. కార్పొరేషన్ కమిషనర్ భావన ఆదేశాల మేరకు నీటి సరఫరా, ఇంజనీరింగ్ విభాగం ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలతో సమాయత్తమైంది. కాల్వలు మూసే సమయం నుంచి తిరిగి తెరిచే వరకు కాకినాడ నగర ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా ముందస్తు కార్యాచరణలో భాగంగా రూ.1.34కోట్లతో ప్రతిపాదనలకు టెండరు ప్రక్రియను కూడా పూర్తి చేశారు. వేసవి కార్యాచరణలో భాగంగా ఆ నిధులతో పలు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

నిధుల కేటాయింపు ఇలా..

ఎస్ఎస్ ట్యాంక్ నింపడానికి, సామర్లకోట హైలెవల్ కెనాల్ ఆఫ్‌టేక్ పాయింట్ వద్ద పంపింగ్ ఏర్పాట్ల కోసం జనరేటర్ల ఆపరేటింగ్ నిమిత్తం రూ.2.97 లక్షలు, ముడినీటిలో ఆల్గేను తగ్గించడంకోసం నడుస్తున్న ఏరేటర్ల కోసం 62.5కేవీఏ జనరేటర్ల ఆపరేటింగ్‌కోసం రూ.8.16లక్షలు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ ప్రదేశాల్లో పవర్ బోర్లుకు మరమ్మతులు నిమిత్తం రూ.7.09లక్షలు, 1 నుంచి 13, 27 నుంచి 29, 31 నుంచి 34, 46 నుంచి 50 వార్డులకు అదనంగా 4కేఎల్ కెపాసిటీ ట్యాంకర్ల ద్వారా తాగునీటి రవాణా కోసం రూ.8.36లక్షలు, 14 నుంచి 26, 30, 35 నుంచి 45 వరకు గల వార్డులకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి రవాణా నిమిత్తం రూ.8.41లక్షలు, 1 నుంచి 13, 27 నుంచి 29, 31 నుంచి 34, 46 నుంచి 50 వరకు వార్డులకు 20కెఎల్ కెపాసిటీ ట్యాంకర్ల ద్వారా తాగునీటి రవాణా నిమిత్తం రూ.8.22లక్షలు, 1 నుంచి 13, 27 నుంచి 29, 31 నుంచి 34.. 46 నుంచి 50 వరకు పాడైపోయిన పైప్‌లైన్లకు మరమ్మతులకు రూ.8.37లక్షలు, 14 నుంచి 26, 30, 35 నుంచి 45 వార్డుల కోసం పాడైపోయిన పైప్‌లైన్లకు మరమ్మతుల కోసం రూ.8.37లక్షలు, 1 నుంచి 13, 27 నుంచి 29, 31 నుంచి 34 మరియు 46 నుంచి 50 వరకు వివిధ ప్రదేశాల్లో హ్యాండ్ బోర్ల కోసం రూ.6.21లక్షలు, 14 నుంచి 26, 30, 35 నుంచి 45 వరకు వివిధ ప్రదేశాల్లో హ్యాండ్ బోర్లు కోసం రూ.6.21లక్షలు, సామర్లకోట హైలెవల్ కెనాల్ ఆఫ్‌టేక్ పాయింట్‌వద్ద క్రాస్‌బండ్‌ను అందించడం కోసం రూ.5.31లక్షలు, అరట్లకట్ట దిగువ స్థాయి కెనాల్ ఆఫ్ టేక్‌పాయింట్‌వద్ద క్రాస్‌బండ్‌ను అందించడం కోసం రూ.6.35లక్షలు, రా వాటర్ ఆల్గేను తగ్గించడంకోసం కాపర్ సల్ఫేట్ సరఫరా డెలివరీ నిమిత్తం రూ.3.90లక్షలు, శశికాంత్‌నగర్ డబ్ల్యూటీపీ వద్ద 150 హెచ్‌పీ క్లియర్ వాటర్ పంప్ సెంట్, ప్యానెల్ బోర్డు కోసం ఎంఎస్ ఫ్రేమ్‌లు, ఫౌండేషన్‌కు మరమ్మతులు, భర్తీ నిమిత్తం రూ.6.28లక్షలు, 1 నుంచి 13, 27 నుంచి 29.. 31 నుంచి 34 వరకు వివిధ ప్రదేశాల్లో చలివేంద్రాలను అందించడం, నిర్వహించడం కోసం రూ.8.32లక్షలు, కేఎంసీలో వార్డులు 14 నుంచి 26, 30, 35 నుంచి 435 వరకు వివిధ ప్రదేశాల్లో చలివేంద్రాల కోసం రూ.8.37లక్షలు, 46 నుంచి 50 వార్డుల వరకు వివిధ ప్రదేశాల్లో చలివేంద్రాలను అందించడం కోసం రూ.5.61లక్షలకు ప్రణాళికలకు సిద్ధం చేశారు. కార్పొరేషన్‌వద్ద ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆరు నీళ్ల ట్యాంకర్లను అదనంగా అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. మొత్తం రూ.1.34 కోట్ల ప్రతిపాదనలతో సమాయత్తమయ్యారు.

రిజర్వాయర్లలో సరిపడినంతగా నీరు

దాహార్తిని తీర్చే ప్రధాన వనరులైన సామర్లకోట సాంబమూర్తి రిజర్వాయర్, అరట్లకట్ల వేసవి జలాశయాల్లో నీటిని సమృద్ధిగా నిల్వ చేశారు. ఇందులో అరట్లకట్ట రిజర్వాయర్‌లో ఇప్పటికే నీరు సరిపడినంతంగా ఉందని చెపుతున్నారు. సామర్లకోట రిజర్వాయర్‌ను కూడా పూర్తి నీటి వనరులతో సిద్ధమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. సామర్లకోట జలాశయంలో 1582 మిలియన్ లీటర్లు, అరట్లకట్టలో 821 మిలియన్ లీటర్ల నీటి సామర్థ్యం ఉండడంతో వేసవిలో నీటి కొరత ఉండదని భావిస్తున్నారు. వాస్తవానికి అందుబాటులో ఉన్న నీటి నిల్వలతో నగరంలోని 52వేల కుళాయి కనెక్షన్లు, 1700 పబ్లిక్ ట్యాప్‌లకు 22 ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్ల ద్వారా సమృద్ధిగా నీరు అందించగలమన్న ధీమాతో నగరపాలక సంస్థ ఉంది. ఇక కాకినాడలోని పర్లోపేట, సంజయ్ నగర్, గణేష్‌నగర్, జ్యోతులకాలనీ వంటి ప్రాంతాల్లో నీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని భావిస్తున్నప్పటికీ ఈ పరిస్థితిని అధిగమించగలమని చెప్తున్నారు. గతంలో మహాలక్ష్మినగర్ ప్రాంతంలో తీవ్రమైన నీటి ఎద్దడి ఎదుర్కొనే పరిస్థితుల్లో అక్కడ 1500 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ఈఎల్ఎస్ ఆమ్లను నిర్మించడంవల్ల ఏ ఇబ్బంది ఉండదని చెపుతున్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు
-భావన, కమిషనర్, కాకినాడ

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నాం. ఇందుకోసం వేసవి కార్యాచరణ సిద్ధం చేశాం. ఆ మేరకు నగరపాలక సంస్థ ఏర్పాట్లు చేసింది. ప్రధాన ప్రాంతాల్లో చలివేంద్రాలనుకూడా ఏర్పాటు చేస్తాం. ఎట్టిపరిస్థితుల్లోను నీటి ఎద్దడి లేకుండా ఉండాలన్నదే ప్రధాన లక్ష్యం.



ప్లీజ్... ప్రాణం నిలపండి

- రోడ్డు ప్రమాదాల్లో మొదటి గంటే కీలకం
- క్షతగాత్రుడిని సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్తే రూ.25వేలు బహుమతి
- ప్రమాదాల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన 'గుడ్ సమరిటన్' పథకం

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కళ్ల ముందు ప్రమాదం జరిగింది. క్షతగాత్రులు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. కానీ వారిని కాపాడేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. క్షణాల్లో ఆసుపత్రిలో చేర్పించాలన్న ఆలోచన ఉన్నా భవిష్యత్‌లో కేసుల్లో ఇరుక్కోవలసి వస్తుందేమో, కోర్టుల చుట్టూ తిరగాలేమోనన్న అనుమానం.. భయం వెంటాడే పరిస్థితి. ఇలాంటి సంఘటనలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం 'గుడ్ సమరిటన్' పథకం తీసుకువచ్చింది. క్షతగాత్రుల్ని తక్షణమే ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలు కాపాడేలా చేసిన వారికి రూ.5వేలు ప్రోత్సాహకం ప్రకటించి అమలు చేసింది. తాజాగా ఆ మొత్తాన్ని రూ.25వేలకు పెంచింది.

ఎక్కువ మందిని కాపాడితే లక్ష

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సహాయం అందక సకాలంలో ఆసుపత్రికి తరలించక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. క్షతగాత్రుల్ని గోల్డెన్ అవర్ (ప్రమాదం జరిగిన గంట లోపు) ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు నిలిచే అవకాశాలెక్కువని వైద్యులు చెప్తున్నారు. ఇలా చేసిన వారికి పోలీసు కేసుల భయం లేకుండా గుడ్ సమరిటన్ చట్టం అండగా నిలుస్తుంది. ఎక్కువ మందిని కాపాడితే రూ.లక్ష అదనపు ప్రోత్సాహకం అందిస్తారు.

ప్రోత్సాహకం పొందాలంటే..

ప్రాణాపాయంలో ఉన్న వారికి ఆస్పత్రికి తరలించే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందిస్తే.. పోలీసులు అధికారికంగా లేఖ ఇస్తారు. ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ వివరాలతో పాటు పోలీసు శాఖ, ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను జతచేసి తహసీల్దార్‌కు దరఖాస్తు చేయాలి. రవాణా, రెవెన్యూ పోలీసు, జాతీయ రహదారుల సంస్థ, ఆర్అండ్‌బీ అధికారులతో కూడిన కమిటీ గుర్తించి నగదు ప్రోత్సాహకానికి ఎంపిక చేస్తుంది.



కేసుల భయం అవసరం లేదు

కె.శ్రీధర్, కాకినాడ జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషనర్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తుల్ని ఆసుపత్రికి తరలిస్తే కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందన్న అపోహలు వద్దు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆస్పత్రికి తరలించినా, అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినా పోలీసుల నుంచి ఇబ్బందులు ఉండవు. రోడ్డు ప్రమాద కేసులకు సాక్షులుగా ఉండాల్సిన అవసరం లేదు. ఆస్పత్రిలో ఫోన్ నెంబర్ కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు. అవసరాన్ని బట్టి పోలీసులే యూనిఫాం లేకుండా మీ ఇంటికి వచ్చి వివరాలు తెలుసుకుంటారు తప్ప మీరు పోలీస్‌స్టేషన్‌కి వెళ్లాల్సిన అవసరం లేదు. క్షతగాత్రుల్ని సకాలంలో ఆస్పత్రికి తీసుకువస్తే ఒకరి ప్రాణమే కాదు వారి కుటుంబం రోడ్డున పడకుండా కాపాడినవారవుతారు. అలాంటి వారిని ప్రభుత్వం ప్రాణదాతగా గుర్తించి ప్రశంసాపత్రంతో పాటు ప్రోత్సాహక నగదు కూడా అందజేస్తుంది.



బాగుంటే నలుగురికి చెప్పండి

- లేకపోతే వంద మందికి చెప్పండి
- 'కోర్ట్' మూవీలో కీలక పాత్రధారి ప్రియదర్శి
- కాకినాడ వాసిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటా: నటి శ్రీదేవి
- కాకినాడలో చిత్ర బృందం సందడి





కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సినిమా బాగుంటే నలుగురికి చెప్పండి... లేకపోతే వంద మందికి చెప్పండని 'కోర్టు' మూవీలో కీలక పాత్రధారి ప్రియదర్శి అన్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఈ చిత్ర బృందం కాకినాడలో మంగళవారం సందడి చేసింది. నటీనటులు ప్రేక్షకులను అలరించారు. కీలక పాత్ర పోషించిన ప్రియదర్శి న్యాయవాదిగా తనదైన శైలిలో ఆకట్టుకున్నారు. అరుదైన పాత్ర తనకు రావడం అదృష్టమన్నారు. కథానాయిక చేసిన శ్రీదేవి కాకినాడ నగరవాసి కావడంతో చాలా మంది చూడ్డానికి వచ్చారు. కోర్టు చిత్రం విజయోత్సవ యాత్రలో భాగంగా మంగళవారం సాయంత్రం సినిమా ప్రదర్శితమవుతున్న ఆనంద్ సినీ కాంప్లెక్స్‌ను చిత్ర బృందం సందర్శించింది. వారికి లక్ష్మీ టాకీస్ ప్రొప్రయిటర్ శ్రీనుబాబు స్వాగతం పలికారు. చిత్ర దర్శకుడు రామ్‌జగదీష్ మాట్లాడుతూ కథా బలంతో ఉన్న సినిమాలకు తెలుగు ప్రేక్షకులు పట్టడం కడతారన్నారు. నటి శ్రీదేవి మాట్లాడుతూ ఇంటర్ చదువుతున్న తనకు ఈ సినిమాలో నటించే అవకాశం రావడం అదృష్టంగా బావిస్తున్నానన్నారు. కాకినాడ వాసిగా సినిమాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధిస్తానన్నారు. డిస్ట్రిబ్యూటర్లు అయిన జగ్గంపేట వీరాంజనేయ ఫిలిమ్స్ అధినేతలు కొత్త శివ, బూర్లు సాయి, నటులు హర్షరోషన్, రామ్‌జగదీష్, సాంకేతిక బృందం సభ్యులు ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం చిత్ర బృందం వాకలపూడిలోని హీరోయిన్ శ్రీదేవి బంధువుల గృహానికి వెళ్లి సందడి చేశారు. హీరో, హీరోయిన్లతో శ్రీదేవి బంధువులు, చుట్టుపక్కల వారు సెల్ఫీలు తీసుకున్నారు.



అభిమానులతో సెల్ఫీ దిగుతున్న హీరో, హీరోయిన్ హర్షరోషన్, శ్రీదేవి

నేర పరిశోధనకు సాంకేతిక పరిజ్ఞానం జోడించాలి

- ఏలూరు రేంజ్ ఐజీ జీవీకే అశోక్‌కుమార్



అమలాపురం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఐజీ

అమలాపురం టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలు మెరుగ్గా నిర్వహించాలంటే ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత జోడించాలని ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఐజీ) జీవీకే అశోక్‌కుమార్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో ఆయనకు స్వాగతం పలికారు. తొలుత జిల్లా పోలీసు కార్యాలయంలోని అడ్మినిస్ట్రేషన్ విభాగాన్ని పరిశీలించి రికార్డులను అశోక్‌కుమార్ తనిఖీ చేశారు. అనంతరం జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో, జిల్లా ట్రాఫిక్ రికార్డ్స్ బ్యూరో, స్పెషల్ బ్రాంచి విభాగాల రికార్డులను పరిశీలించారు. పోలీసు కార్యాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన జిల్లా కంట్రోల్ రూము, సోషల్ మీడియా విభాగాన్ని స్వయంగా సందర్శించి సిబ్బంది పనితీరును పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరు మెరుగ్గా ఉంటేనే జిల్లా పోలీసులకు మంచి పేరు వస్తుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నేర పరిశోధనలను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు ఎస్పీ ఎవీఆర్‌పీబీ ప్రసాద్, సీఐలు జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఆదిత్య'లో ఎండ్యురన్స్

- హాజరుకానున్న డాక్టర్ గంగారెడ్డి (బెంగళూరు)



ప్రో కార్టింగ్ ఎండురన్స్‌కి టెస్టులు నిర్వహిస్తున్న దృశ్యం

గండేపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో బుధవారం ఎండురన్స్ పోటీలు జరగనున్నాయి. వర్సిటీలో ఈనెల 17న ప్రారంభమైన ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండురన్స్ ఛాంపియన్‌షిప్ 2025 సీజన్- 5 పోటీల్లో భాగంగా రెండోరోజు పలు టెక్నిక్ అంశాల్లో టెక్నికల్ టీమ్ పరిశీలించింది. వివిధ కళాశాలల నుంచి వచ్చిన టీమ్‌లు మండుటెండను సైతం లెక్కచేయకుండా తమ పనుల్లో నిమగ్నమయ్యారు. ట్రయిల్‌రన్ నిర్వహిస్తూ టీమ్ సభ్యులు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని ... ఉత్కంఠను నింపారు. బ్రేకింగ్ టెస్ట్, యాక్సిల్ రేషన్, స్కిడ్‌పాడ్, ఆటోక్రోస్ టెస్ట్, తదితర డైనమిక్ ఈవెంట్స్ జరిగాయి. బుధవారం మధ్యాహ్నం రెండుగంటల నుంచి 3.30 గంటల వరకు ఎండురన్స్ జరగనున్నాయి.

ఉత్కంఠగా సాగే ఈ పోటీకి ముఖ్యఅతిథిగా డాక్టర్ గంగారెడ్డి (అసోసియేట్ వైస్‌ప్రెసిడెంట్ హెడ్ ఆఫ్ అడ్వాన్స్డ్ ఇంజనీరింగ్ గ్రూప్ బెంగళూరు) నుంచి వస్తున్నారని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు.

కాకినాడ తీరంలో సైనిక విన్యాసాలు

- వచ్చేనెల 8 నుంచి నిర్వహణ
- భారత్, అమెరికా వాయుసేన దళాలు ఉమ్మడిగా..
- కాకినాడ జిల్లా డీఆర్వో వెంకట్రావు వెల్లడి



సైనిక అధికారులతో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ తీరంలోని నేషల్ ఎన్‌క్లేవ్‌లో వచ్చేనెల 8వ తేదీ నుంచి 13 వరకు భారత్, అమెరికా వాయుసేన దళాలు ఉమ్మడిగా టైగర్ ట్రేయంఫ్ -25 సైనికవిన్యాసాలు జరగనున్నాయి. దీనికోసం అవసరమైన సివిల్ సహకారాన్ని అందించాలని కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను కోరారు. నిర్వహణపై కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం సైనిక, సివిల్ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ 7వ తేదీ నాటికి విన్యాసాలు జరిగే క్యాంపింగ్ సైట్‌లో చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయించాలన్నారు. అలాగే వారం రోజుల పాటు పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సిబ్బంది, యంత్రాలను సిద్ధంచేయాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను సూచించారు. అగ్నిమాపకశాఖ నీటితో నింపిన రెండు ఫైర్ ఇంజన్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. విన్యాసాలు జరిగే ప్రాంతంలో స్ట్రీట్ లైట్ బ్లాకింగ్, బారికేడింగ్, ట్రాఫిక్‌మళ్లింపు, కోడ్ నియంత్రణ అంశాలను పోలీస్ శాఖ చేపట్టాలన్నారు. అలాగే సైనిక అధికారులు, సిబ్బంది, సామాగ్రిని విశాఖపట్నం - కాకినాడ మధ్యసంచరించే రూట్లలో రోడ్ కాన్వాయ్ ఆపరేషన్స్‌కు అవసరమైన సహకారాన్ని సైనిక అధికారులకు అందించాలన్నారు. మత్స్యకారుల బోట్లు ప్రవేశించకుండా మత్స్యశాఖ, మెరైన్ పోలీస్ శాఖలు కట్టుదిట్టం చేయాలన్నారు. అంతర్జాతీయ సైనిక దళాల భాగస్వామ్యంతో భారత సైన్యం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టైగర్ ట్రేయంఫ్‌ను విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వశాఖలు సమన్వయంతో సహకరించాలన్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. సమావేశంలో సివిల్, మిలిటరీ లైజాన్ అధికారి కమాండర్ కిషోర్, సైనిక అధికారి టీవీవీ ప్రసాద్, మెరైన్ పోలీస్ అధికారి రామ్మోహన్‌రెడ్డి, రూరల్ సీఐ చైతన్యకృష్ణ, ఎంహెచ్‌వో పృథ్వీ, మత్స్యశాఖ అధికారి అనురాధ , తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అటవీ అకాడమీ సొంత భవన నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

దివాన్‌చెరువు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు సమీపంలోని రాష్ట్ర అటవీ అకాడమీకి సొంత భవనం నిర్మాణానికి మార్గం సుగమమైంది. డిప్యూటీ సీఎం పవన్ చొరవతో కేంద్ర అటవీ పర్యావరణ శాఖ రాష్ట్ర అటవీశాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ ఈమేరకు తాజాగా ఆదేశాలిచ్చారు. ఇక్కడ నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గత ఆగస్టులో పవన్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే దీన్ని కొనసాగించడంతో పాటు అక్కడే సొంత భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు. దాంతో పవన్ ఈ విషయాన్ని కేంద్ర అటవీశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఎట్టకేలకు స్పందించిన కేంద్రం చర్యలు చేపట్టాలని రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన రాష్ట్ర అటవీ అకాడమీని దాదాపు ఎనిమిదేళ్లుగా రాష్ట్ర అటవీ పరిశోధనా భవనంలోనే నిర్వహిస్తున్నారు.

ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ ప్రదర్శన

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ నోటిఫికేషన్ ప్రకారం భర్తీ చేయనున్న 3 ఫార్మాసిస్ట్, ఒక డీఈవో, లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్ ఎల్‌జీఎస్ - 4 పోస్టులకు అభ్యర్థుల ప్రొవిజనల్ లిస్టును ఎన్ఐసీలో ప్రదర్శించినట్టు కాకినాడ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ తెలిపారు. ఇందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే 20వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు గ్రీవెన్స్‌లో ఇవ్వాలన్నారు. అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను ఈ దిగువ ఎన్ఐసీల్లో పరిశీలించుకోవాలని కోరారు. హెచ్‌టీటీపీ//ఈస్ట్‌గోదావరి.ఏపీ.జీవోవీ.ఇన్, హెచ్‌టీటీపీ//కాకినాడ.ఏపీ.జీవోవీ.ఇన్, హెచ్‌టీటీపీ//కోనసీమ.ఏపీ.జీవోవీ.ఇన్. సందర్శించవచ్చు.

రాజమహేంద్రవరంలో కోర్ట్ సినిమా యూనిట్ సందడి



స్వామి థియేటర్‌లో సందడి చేస్తున్న చిత్ర బృందం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని స్వామి థియేటర్‌లో మంగళవారం కోర్ట్ సినిమా యూనిట్ సందడి చేసింది. చిత్రంలో పులికొండ లాయర్ పాత్ర పోషించిన ప్రియదర్శి, హీరో హర్షరోషన్, హీరోయిన్లు శ్రీదేవి, రిషిక, రైటర్ కమ్ డైరెక్టర్ రామ్‌జగదీష్, మ్యూజిక్ డైరెక్టర్ , తదితరులు పాల్గొని ప్రేక్షకులతో జోష్ కలిపారు. ఈ సినిమా మా అందర్నీ గెలిపించిందన్నారు. మంచి చిత్రాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుందని మరోసారి ప్రేక్షకులు నిరూపించారన్నారు. నాని సహ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన ఈ సినిమా ఎంతో అద్భుతంగా తెరకెక్కిందన్నారు. చట్టంపై అవగాహన కల్పిస్తూ ఈ చిత్రం రూపుదిద్దుకుందన్నారు. విడుదలైన మూడురోజుల్లోనే రికార్డు స్థాయిలో రూ.25 కోట్ల మేరకు కలెక్షన్స్ రావడం చిత్ర విజయానికి నిదర్శనమన్నారు. థియేటర్ యజమాని పులవర్తి లక్ష్మణస్వామి, జీబీఆర్ ఫిలిమ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్ సీజ్

- అధిక ధరకు టికెట్ల విక్రయం
- రెవెన్యూ అధికారుల మెరుపుదాడి
- అమలాపురంలో శ్రీవెంకటరమణ సినిమా హాలులో ప్రదర్శన నిలిపివేత



థియేటర్ వద్ద మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి

అమలాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా టికెట్ ధరలను పెంచి సినిమాను ప్రదర్శిస్తున్న థియేటర్‌పై రెవెన్యూ అధికారులు మెరుపుదాడి చేసి సీజ్ చేశారు. అమలాపురం పట్టణంలోని శ్రీ వెంకటరమణ థియేటర్‌లో కోర్టు సినిమా ప్రదర్శన టికెట్ ధర రూ.110కి విక్రయించాల్సి ఉండగా .. రూ.150 పెంచుతూ అమ్ముతున్నారని ఆర్డీవో కె.మాధవి, తహశీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్‌కు ఫిర్యాదు అందింది. ఈ మేరకు మంగళవారం థియేటర్‌పై ఆకస్మిక దాడి చేశారు. ముందుగా అధిక ధరలు చెల్లించి టికెట్ కొనుగోలు చేసినవారు యాజమాన్యం తీరుపై విచారణ చేపట్టారు. గత మూడు రోజుల నుంచి టికెట్ ధరలను నిబంధనలకు విరుద్ధంగా పెంచి విక్రయిస్తుండడాన్ని తనిఖీల్లో గుర్తించామని ఆర్డీవో మాధవి మీడియాకు వెల్లడించారు. దీనికి తోడు ఫామ్-బీ లైసెన్సు కూడా రెన్యువల్ చేయనట్టు రికార్డుల తనిఖీలో వెల్లడైందన్నారు. తక్షణమే థియేటర్‌లో తదుపరి షోను నిలిపివేసి రికార్డులను స్వాధీనం చేసుకుని జేసీకి నివేదించారు. విచారణ పూర్తయ్యే వరకు షోలు నిలిపివేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. అమలాపురం డివిజన్‌లో చాలా థియేటర్లలో ఫామ్-బి లైసెన్సులు రెన్యువల్ చేయకుండానే షోలు ప్రదర్శిస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. నిబంధనలను ఎవరూ దాటొద్దన్నారు.

ఆ అధికారులపై చర్యలేవి?

- వైసీపీ పాలనలో నిధుల దుర్వినియోగం
- రంప ఐటీడీఏలో ఆరోగ్య కేంద్రాలకు రూ.62 లక్షలతో స్కానింగ్ యంత్రాల కొనుగోళ్లు
- గిరిజనులకు ఉపయోగం లేని పార్కు నిర్మాణం కోసం రూ.20 లక్షలు

(రంపచోడవరం/ఆంధ్రజ్యోతి)

వైసీపీ పాలనలో రంపచోడవరం ఐటీడీఏ ఉన్నతాధికారులు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. అప్పటి ప్రభుత్వ అధినేత మన్ననల కోసం ప్రాకులాడి, నిబంధనలకు తిలో దకాలిచ్చారు. ఫలితంగా గిరిజనుల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం వెచ్చించాల్సిన నిధులను ఐటీడీఏ పాలక మండలి ఆమోదాలు లేకుండానే చట్ట విరుద్ధ అంశాలకు సైతం వెచ్చించారు. స్కానింగ్ యంత్రాలను వినియోగించేందుకు చట్టపరమైన ఎటువంటి అనుమతులు, వాటి నిర్వహణకు అనుభవజ్ఞులైన నిర్వాహకులు లేకున్నా వాటిని కొనుగోలు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడటమే కాకుండా ప్రభుత్వ ఖజానాకూ నష్టం చేకూర్చిన అధికారి ఒక రైతే, రూ.20 లక్షల ఉపాధి నిధులను నిరుపయోగమైన పార్కు నిర్మాణానికి వెచ్చించిన వారు మరొకరు. కొనుగోలు చేసిన యంత్రాలను వినియోగించే అవకాశమే లేక నేడు నిరుపయోగంగా ఉన్నాయి.


ఓ పీహెచ్‌సీలో నిరుపయోగంగా ఉన్న స్కానింగ్ యంత్రం

ఎవరైనా స్కానింగ్ యంత్రాలను నిర్వహించాలనుకుంటే అది ఆసుపత్రి అయినా, లేక స్కానింగ్ సెంటరైనా చట్టప్రకారం అనుమతులుండాలి. కానీ రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు అటువంటి అనుమతులు ఉన్న దాఖలాలు లేవు. చట్ట విరుద్ధం గానైనా ఆయా స్కానింగ్ యంత్రాలను నిర్వహించే అనుభవము, అనుమతీ ఉన్న వైద్యులు, సాంకేతిక సిబ్బంది లేకుండానే వాడ పల్లి, జడ్డంగి, బోదులూరు, ఇందుకూరుపేట, దుప్పులపాలెం, నరసాపురం, పెదగెద్దాడ, చవటిదిబ్బలు, దేవీపట్నం, కొండమొదలు ఆరోగ్య కేంద్రాలకు రూ.62.69 లక్షలతో అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలను 2022, ఫిబ్రవరిలో కొనుగోలు చేశారు. రూ.37 లక్షలతో పీహెచ్‌సీల అంబులెన్సులు, 108 అంబులెన్సుల కోసం వైర్‌లెస్ డిజిటల్ రిపీటర్లు, డిజిటల్ బేస్ స్టేషన్లు, మొబైల్ సెట్లను కొనుగోలు చేశారు. రెండో విడత కొవిడ్ పేరుతో రూ.59.21 లక్షలతో అంబు బ్యాగ్‌లు, పల్స్ ఆక్సీమీటర్లను, రూ.12.10 లక్షలతో 64 లీటర్ల సామర్థ్యం గల 15 ఆక్సిజన్ సిలెండర్లను మే, 2021లో కొనుగోలు చేశారు.

మరో అధికారి కూడా రంపచోడవరంలో ఒక పార్కు నిర్మాణానికి రూ.20 లక్షల ఉపాధి హామీ నిధులను దుర్వినియోగపర్చారు. ఉపాధి హామీపై జరిగిన ఆడిట్‌లో ఇది తప్పుగా అనిపించలేదు. ఈ ఇద్దరి అధికారుల నిర్ణయాలు వివాదస్పదంగానే రంపచోడ వరం ఐటీడీఏలో సాగాయి. పాలకమండలి ఆమోదం లేకుండానే గిరిజన నిధులను దుర్వినియోగపర్చినా వారిపై ఏ చర్యలూ లేవు. ప్రభుత్వం మారి 9 నెలలు గడిచినా నిధుల దుర్వినియోగ నిర్ణయాలపై చర్యలు లేకపోవడంపై సర్వత్రా గిరిజన వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పూతరేకుల్లో కల్తీనెయ్యి

ల్యాబ్ పరీక్షల్లో నిర్ధారణ

కల్తీ వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం : ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్

ఆత్రేయపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం పేరు చెప్పగానే పూతరేకులు అని గుర్తుకువస్తుంది. ఇక్కడ తయారుచేస్తున్న పూతరేకులకు ఎంతో పేరు ఉంది. సుమారు ఐదు దశాబ్దాల నుంచి ఆత్రేయపురం పరిసర ప్రాంతాల్లో సుమారు 400 కుటుంబాలు పైనే కుటీర పరిశ్రమలుగా పెట్టుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. మహిళలు తయారు చేస్తున్న ఈ పూతరేకుల వ్యాపారంతో గ్రామరూపురేఖలే మారిపోయాయి. ఈ వ్యాపారం దినదిన అభివృద్ధి చెందుతూ దేశనలుమూలలతో పాటు ఖంతరాలు దాటిపోయింది. ఇళ్లల్లో జరిగే ఫంక్షన్లకు ఈ స్వీటును రుచి చూపిస్తారు. ఇంత పేరుప్రఖ్యాతలు ఉన్న ఈ పూతరేకుల్లో వాడే నెయ్యి విషయంలో కొంతమంది అక్రమార్కులు వ్యాపారం సాగిస్తున్నారు. కల్తీనెయ్యిని వాడుతూ స్వీటు ప్రియుల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. కల్తీనెయ్యి అమ్ముతున్న వ్యాపారస్తులకు అధిక ఆదాయం రావడంతో దీన్నే జోరుగా విక్రయిస్తున్నారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రతిరోజు వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తులు ఈ స్వీట్లను కొనుగోలుచేసుకుని బంధుమిత్రులకు రుచిచూపిస్తుంటారు. ఈ క్రమంలో గత కొంతకాలం నుంచి కొంతమంది వ్యాపారులు కల్తీనెయ్యి విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడులు

పూతరేకుల్లో కల్తీనెయ్యి వాడుతున్నారనే వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఫుడ్‌సేఫ్టీ అధికారుల బృందం ఫిబ్రవరి 17న కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో పూతరేకుల తయారీ షాపులు, కల్తీనెయ్యి అమ్మకాలు సాగిస్తున్న షాపులపై ముమ్మరదాడులు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. 160 కిలోల నెయ్యిని కల్తీ నెయ్యిగా అనుమానించి సీజ్ చేసి నమునాలను సేకరించారు. అలాగే వివిధ దుకాణాల్లో 8 సాంపిల్స్‌ను సేకరించి సీల్డ్ కవర్లలో భద్రపరిచారు. ఈ నెయ్యి సాంపిల్స్‌ను హైదరాబాద్ ల్యాబ్‌లకు పంపించారు. అక్కడ ఈ నెయ్యిలో కల్తీ జరిగినట్టు గుర్తించారు. ఫుడ్‌సేఫ్టీ కంట్రోలర్ శ్రీనివాస్ ల్యాబ్ రిపోర్టులో కల్తీ నెయ్యి వాడుతున్నట్టు నిర్ధారించినట్టుగా గుర్తించారు. కల్తీనెయ్యి అమ్ముతున్న, కొనుగోలు చేసి అమ్మకాలు చేస్తున్న షాపు యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని తద్వారా వారిపై క్రిమినల్ కేసులు పెడతామని వివరించారు. వ్యాపారులు పూతరేకుల్లో విచ్చలవిడిగా కల్తీనెయ్యి వాడుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు. త్వరలోనే కల్తీనెయ్యి అమ్మకం తయారీషాపులపై దాడులు నిర్వహిస్తామన్నారు. నాణ్యమైన నెయ్యి(బ్రాండ్) వాడాలని లైసెన్సు లేకుండా వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్య లు తప్పవని స్పష్టం చేశారు.


కల్తీనెయ్యి ప్యాకెట్లు


ఆత్రేయపురంలో నిర్వహించిన దాడుల్లో నెయ్యిని సీజ్ చేసి ల్యాబ్‌కు పంపించిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు(ఫైల్)

దెబ్బతిన్న పూతరేకుల ప్రతిష్ట

ఎన్నో ఏళ్ల నుంచి మహిళలు పూతరేకులు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంటి దగ్గర తయారుచేస్తున్న నెయ్యి, బ్రాండెడ్ నెయ్యిని వాడుతూ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూ ఆర్థికంగా నిలతొక్కుకుంటున్నారు. కొంతమంది వ్యాపారులు కల్తీనెయ్యితో పూతరేకులను తయారుచేయడంతో ఆత్రేయపురం పూతరేకుల ప్రతిష్ట దెబ్బతింది. దీంతో కొంతమంది వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

వెంటూరులో కారుణ్య అంత్యక్రియలు పూర్తి

రాయవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తండ్రి కర్కశానికి బలైన చిన్నారి పిల్లి కారుణ్య(7)కి మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెంటూరులో అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈనెల 17న వెంటూరు గ్రామానికి చెందిన పిల్లి రాజు తన కుమార్తె కారణ్యను, కుమారుడు రామ్‌సందీప్‌ను స్కూల్ నుంచి ఇంటికి తీసుకువస్తూ రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు సమీపంలో గజపతినగరం వద్ద కాలువలో తోసేసిన ఘటన పాఠకులకు విధితమే. ఈ సంఘటనలో కారుణ్య కాలువలో కొట్టుకుపోయి మృతి చెందగా మృతదేహానికి పోలీసులు పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు, బంధువులు వెంటూరులో రోధనల మధ్య అంత్యక్రియలు పూర్తిచేశారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చిన క్రమంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆర్థిక సమస్యలే కారణమా?

వెంటూరు గ్రామానికి చెందిన పిల్లి రాజు వ్యాపారలావాదేవిల నేపథ్యంలో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు గ్రామంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. రాజు తన పిల్లల్ని చంపి తాను చనిపోవాలని నిర్ణయించుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. పిల్లల్ని తోసేసిన తరువాత రాజు మాత్రం అక్కడి నుంచి తన మోటారు వాహనంపై పరారు కాగా, రెండో రోజు రాజు ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులు సాంకేతికత ఆధారంగా రాజు ఆచూకీని కనిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజు బతికి ఉన్నాడా లేక తాను చనిపోవాలని నిర్ణయించుకుని ఎక్కడికైనా వెళ్లిపోయాడా అనే మిస్టరీ వీడడం లేదు.

రాజు కోసం పోలీసుల గాలింపు


పిల్లి రాజు

ద్రాక్షారామ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కన్న పిల్లలను కాలువలోకి తోసి కుమార్తె మృతికి కారణమైన తండ్రి పిల్లి రాజు ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కారుణ్య మృతిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్ తెలిపారు. అప్పుల బాధ తాళలేక ఈ ఘోరానికి పాల్పడినట్టు భావిస్తున్నారు. ప్రాణాలతో బయటపడిన కుమారుడు సందీప్ ఘటన పూర్వాపరాలు వెల్లడించారు. పిల్లి రాజు(40) తన పిల్లలను కాలువలోకి తోసి ఏపీ39హెచ్‌కె 1660 నెంబరు గల సుజుకి యాక్సెస్ మెరూన్ కలర్ మోటార్ సైకిల్‌పై పారిపోయాడు. రాజు తెలుపు రంగు షర్టు, నలుపు/నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. అతడి ఆచూకీ తెలిస్తే రామచంద్రపురం డీఎస్పీ 9440796507, సీఐ 34407965 36, ఎస్‌ఐ 9440904850లో సమాచారం ఇవ్వాలని దర్యాప్తు అధికారి సీఐ ఎం.వెంకటనారాయణ కోరారు. ఈమేరకు రాజు ఫొటో విడుదల చేశారు.

ప్రతి మంగళవారం స్పెషల్‌డ్రైవ్

- అన్నవరం దేవస్థానంలో కాకినాడ జిల్లా కలెక్టర్ పరిశీలన
- అపరిశుభ్ర వాతావరణంపై అసహనం
- పంపా రిజర్వాయర్‌లో నీటి అంశంపై అధికారులతో చర్చ
- సత్యనికేతన్ సత్రం ఘటనపై త్వరలో చర్యలుంటాయని వెల్లడి


మరుగుదొడ్ల పరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

అన్నవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పర్యటించారు. సత్యదేవుని దర్శించిన అనంతరం నిత్యకల్యాణమండపం వద్ద నున్న మరుగుదొడ్లను పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణంపై అసహనం వ్యక్తం చేశారు. స్వామివారి కల్యాణకట్ట వద్ద పరిసరాల అపరిశుభ్రతను గమనించి ప్రతి మంగళవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని, పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని ఈవో సుబ్బారావుకు సూచించారు. అనంతరం పంపా రిజర్వాయర్‌లో నీరు అడుగంటిపోవడం తద్వారా గ్రామంలో నీటిఎద్దడి పొంచి ఉన్న నేపథ్యంలో దాని నివారణకు చర్యలపై పోలవరం, ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. సీతారాముల దివ్యకల్యాణోత్సవాలలో చక్రస్నానం, సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవాల చక్రస్నానానికి రిజర్వాయిర్‌లో నీటి అవసరాలపై చర్చించారు. పోలవరం అక్విడెక్టు వద్ద పనుల నేపథ్యంలో ఏలేరు నీరు పంపారిజర్వాయిర్‌కు మళ్లించడంపై సుమారు 10 కిలోమీటర్ల మట్టిరోడ్డులో ప్రయాణం చేసి పనులు పరిశీలించారు. పోలవరం పనులు త్వరితగతిన పూర్తిచేయాలనే ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో పనులకు ఆటంకం కలగకుండా ఏలేరు నీటిని పంపాకు మళ్లించడంలో సాధ్యసాధ్యాలపై ఇరిగేషన్, పోలవరం అధికారులతో చర్చించారు. దీనిపై 3 రోజుల్లోగా నివేదికను ఇవ్వాలని పోలవరం అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడారు. వేసవిలో నీటిఎద్దడి లేకుండా తీసుకోవలసిన చర్యలపై చర్చించామని. పంటపొలాల విషయం ఎలా ఉన్నా తాగునీరు పూర్తిస్థాయిలో లేకుంటే ఇబ్బందులు వస్తాయని, అందువల్ల సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సత్యనికేతన్ సత్రంలో మద్యంబాటిళ్లు దొరికిన ఘటనపై ఆయన స్పందించారు. ఇప్పటికే నివేదికను తెప్పించడం జరిగిందని, దీనిపై త్వరలో చర్యలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరిరావు, పంపా నీటిసంఘం చైర్మన్ బైరావర్జుల శ్రీరామచంద్రమూర్తి తదితరులున్నారు.


పోలవరం కెనాల్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

సత్యదేవుని ఆభరణాలను అప్పగించిన పూర్వపు ఈవో

అన్నవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని ఖజానాలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలను మంగళవారం పూర్వపు ఈవో సత్యనారాయణ మూర్తి, ప్రస్తుత ఈవో వీర్ల సుబ్బారావుకు దేవదాయశాఖ జ్యుయలరీ వెరిఫికేషన్ అధికారుల సమక్షంలో అందజేశారు. పనిచేస్తున్న ఈవో బదిలీ సమయంలో నూతనంగా నియమించిన ఈవోకు రికార్డుల ప్రకారం అప్పగించాల్సి ఉంటుంది. అయితే సత్యనారాయణమూర్తి 2023లో బదిలీకాగా తదుపరి చంద్రశేఖర ఆజాద్, రామచంద్రమోహన్ ఈవోలుగా బాధ్యతలు స్వీకరించినా సమయాభావం వల్ల వారు ఆభరణాల అప్పగింత చార్జి తీసుకోలేదు. తాజా ఉత్తర్వుల మేరకు దేవస్థానం ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ మంగళవారం ఈవో సుబ్బారావు పర్యవేక్షణలో స్వీకరించారు. ఇకపై ఈవో నుంచి ఈవోకు కాకుండా డిప్యూటీ కమిషనర్ నుంచి డిప్యూటీ కమిషనర్ ఆధీనంలో ఈ ఆభరణాలు ఉంటాయి. డిప్యూటీ కమిషనర్ బదిలీ అయితే తదుపరి డిప్యూటీ కమిషనర్‌కు అప్పగించాల్సి ఉంటుంది. సత్యదేవునికి సుమారు 70 కిలోల బంగారం, 3 వేల కిలోల వెండి ఆభరణాలు ఉన్నట్టు తెలుస్తుంది.


ఆభరణాలను అప్పగిస్తున్న పూర్వపు ఈవో

పాఠశాలలో సిమెంటు బస్తాల వ్యవహారంపై

కోనసీమ కలెక్టర్ సీరియస్!

చీఫ్ సూపరింటెండెంట్, హెచ్‌ఎంలపై క్రమశిక్షణా చర్యలకు ఆదేశం

డీఈవో సలీంబాషా వెల్లడి

అమలాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలో నల్లవంతెన వద్ద గల ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు ముందు సిమెంటు బస్తాల తరలింపు వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ స్పందించారు. ఈ వ్యవహారంపై వచ్చిన వార్తా కథనాలపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారని ఆర్డీవో కె.మాధవి, డీఈవో షేక్ సలీంబాషాలు విచారణాధికారులుగా విచారణ చేసి నివేదికను కలెక్టర్ పరిశీలన కోసం పంపించారు. దీనిలో భాగంగా పరీక్షా సమయానికి కొన్ని గంటల ముందే సిమెంటు బస్తాలు తరలించడం వాస్తవమని నిర్ధారించారు. దాంతో పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మీనాకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్ అలసత్వం వహించినట్టు విచారణలో వెల్లడి కావడంతో వారిపై శాఖాపరమైన చర్యలకు కలెక్టర్ ఆదేశించినట్టు డీఈవో ఆ ప్రకటనలో తెలిపారు. వారిద్దరిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటానని, ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని డీఈవో విజ్ఞప్తి చేశారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

32 గ్రాముల బంగారం, 11 కిలోల వెండి స్వాధీనం


ఏలేశ్వరంలో వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ


స్వాధీనం చేసుకున్న వెండి, బంగారు ఆభరణాలు

ఏలేశ్వరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గత నెల 9వ తేదీన కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని శ్రీసిద్ధనాద్ జ్యూయలర్స్ నందు జరిగిన చోరీ కేసులో నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మంగళవారం ఏలేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న జ్యూయలరీ దుకాణం వెనుక భాగం నుంచి ఆగంతకులు చొరబడి 50 గ్రాముల బంగారు ఆభరాలు, 32 కిలోల వెండి అపహరించిన విషయం విదితమే. దీనిపై ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీహరి రాజు పర్యవేక్షణలో సీఐ సూర్య అప్పారావు, ఎస్‌ఐ రామలింగేశ్వరరావు దర్యాప్తు ముమ్మరం చేశారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు యర్రవరం వెళ్లే రోడ్డులో తిరుమాలి జంక్షన్ దగ్గర వాహనాలకు తనిఖీ చేస్తుండగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి వివరాలను తెలుసుకున్నారు. కడప జిల్లా రాజంపేట మండలం అత్తిరాల గ్రామానికి చెందిన కరణం కుమార్, అల్లూరి మండలం చలంగారిపల్లె గ్రామానికి చెందిన గుమ్మళ్ల వెంకట సుబ్బయ్యను అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరిపై రాష్ట్రంలో పలు కేసులు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. వారి నుంచి ఏలేశ్వరం దోపిడీకి సంబంధించి 32 గ్రాముల బంగారం, 11 కిలోల వెండి స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. కేసును చేదించిన సీఐ,ఎస్‌ఐ, సిబ్బందిని అభినందించారు.

బస్సు కింద పడి వ్యక్తి మృతి

రామచంద్రపురం (ద్రాక్షారామ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురంలో మంగళవారం సాయంత్రం మార్కెట్ సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కెఎస్‌ఆర్ నగర్‌కు చెందిన పల్లె జీవరత్నం (70) మృతిచెందాడు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. జీవరత్నం మోటారు సైకిల్‌పై పాతబస్టాండు నుంచి కెఎస్‌ఆర్ నగర్ వెళ్తుండగా వెనుక వైపు నుంచి వస్తున్న సాలూరు డిపోకు చెందిన బస్సు వెనుక చక్రం కింద పడిపోయాడు. స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. ఎస్‌ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారి పడి...

తుని రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో రేగుపాలెం యలమంచిలి మధ్యలో జరిగింది. సుమారు 50ఏళ్ల వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏ ఆధారాలు కానరాకపోవడంతో మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించి భద్రపరచినట్టు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. వివరాలు తెలిస్తే 9490619020లో సంప్రదించాలని కోరారు.

పేకాడుతున్న 19 మంది అరెస్ట్


జి.దొంతమూరులో పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న ఎస్‌ఐలు

రంగంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ ఆధ్వర్యంలో మంగళవారం రంగంపేట, అనపర్తి ఎస్‌ఐలు తోట కృష్ణసాయి, ఎల్.శ్రీనునాయక్ సిబ్బందితో తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామశివారులో పేకాట శిబిరంపై దాడి చేసి 19 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,09,300 నగదు, 9 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకుని రంగంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రంగంపేట ఎస్‌ఐ తెలిపారు.

అన్నవరంలో అపూర్వ స్వాగతం

సైకిల్ ర్యాలీ చేస్తున్న సీఐఎస్‌ఎఫ్ బృందానికి హారతులిచ్చిన మహిళలు


బృంద సభ్యులకు హారతి ఇస్తున్న మహిళలు

అన్నవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సమృద్ధి, సంరక్షణ పేరుతో దేశంలో ఉన్న 6500 కిలోమీటర్ల సముద్ర తీరప్రాంత ప్రజల్లో దేశ భద్రత, సమైక్యతను పెంపొందించాలనే ఉద్దేశంతో చేపట్టిన సీఐఎస్‌ఎఫ్ (కేంద్ర పారిశ్రామిక భద్రత దళం) చేపట్టిన సైకిల్ ర్యాలీకి కాకినాడ జిల్లా అన్నవరంలో అపూర్వ స్వాగతం లభించింది. గ్రామంలోకి చేరుకోగానే సర్పంచ్ కుమార్‌రాజా స్వాగతం పలకగా మహిళలు హారతులిచ్చారు. మార్చి 7న పశ్చిమబెంగాల్ బికిలీ నుంచి 60మంది సీఐఎస్‌ఎఫ్ దళంతో ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర 2700 కిలోమీటర్ల సాగి కన్యాకుమారితో ముగుస్తుందని బృందం పేర్కొంది. ఈ దళం ఏర్పాటై మార్చి 10 నాటికి 55 ఏళ్లు పూర్తిచేసుకుందన్నారు. మంగళవారం రాత్రికి అన్నవరం సత్యదేవుని సన్నిధిలో బస చేసి బుధవారం ర్యాలీ ప్రారంభిస్తామన్నారు.


అన్నవరం చేరుకున్న సీఐఎస్‌ఎఫ్ బృందంతో స్థానికులు

రుణాలిప్పిస్తామని మోసం

రూ.2,500 చొప్పున వసూలు

సర్పవరం జంక్షన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి సంఘాల గ్రూపులకు రుణాలిప్పిస్తామని చెప్పి ఒక్కో గ్రూపు సభ్యుల నుంచి రూ.25వేలు వసూలు చేసి మోసం చేసినట్టు పలువురు మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ వలసపాకలలోని బంధన్ బ్యాంకులో డ్వాక్రా సభ్యులకు రుణాలు ఇప్పిస్తామని చెప్పి బ్యాంకుకి చెందిన ఇద్దరు క్షేత్రస్థాయి సిబ్బంది 3గ్రూపుల నుంచి ఒక్కో సభ్యురాలి నుంచి రూ.2,500 చొప్పున వసూలు చేశారని పలువురు మహిళలు ఆరోపించారు. పెద్ద మొత్తంలో రుణాలు మంజూరు చేయిస్తానని నమ్మబలికిన బ్యాంకు రికవరీ సిబ్బంది గణేష్, ఉదయ్‌భాస్కర్ తన వద్ద నుంచి రూ.1.45 లక్షలు తీసుకున్నారని ఏడిద సూర్యకుమారి తెలిపింది. మరో గ్రూపునకు రుణాల మంజూరు కోసం రూ.2.30 లక్షలు తీసుకున్నట్టు ఆర్.చిన్నఅమ్ములు తెలిపింది. లోన్ కోసం లంచం తీసుకున్నా లోన్ మంజూరు కాకపోవడంతో వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని బంధన్ బ్యాంకు బ్రాంచి మేనేజర్ సూరిబాబుకు ఫిర్యాదు చేసినట్టు తెలిపింది. విచారణ జరిపి న్యాయం చేస్తామని మేనేజర్ హామీ ఇచ్చినట్టు తెలిపింది. ఈ విషయమై మేనేజర్‌ని వివరణ కోరగా ఇద్దరు సిబ్బందిపై విచారణ నిర్వహిస్తున్నట్టు సూరిబాబు తెలిపారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే నేరుగా బ్యాంకుకి వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాళ్లపూడి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పెద్దేవం శివారులో రావూరుపాడు బస్ షెల్టరు వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మరణించిన వ్యక్తి వయసు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుంది. 4రోజులుగా ఇక్కడేఉంటూ చుట్టుపక్కల వారు పెట్టింది తింటూ మంగళవారం మృతి చెందాడు. వివరాలు తెలిస్తే తాళ్లపూడి పోలీసులకు తెలపాలని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత


ట్రాఫిక్ ఎస్‌ఐతో బాలుడు

సామర్లకోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట పోలీస్ అవుట్ పోస్ట్ సమీపాన రోడ్డుపై సుమారు 10ఏళ్ల బాలుడు అనుమానాస్పద స్థితిలో చేతిలో సెల్‌ఫోన్ పట్టుకుని తిరుగుతుండడాన్ని ట్రాఫిక్ పోలీసు సన్యాసిరావు, ఇతరులు గుర్తించి చేరదీశారు. బాలుడిని ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా గరగారావు వద్దకు చేర్చారు. దీంతో పోలీసులు బాలుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లో నంబర్ల ఆధారంగా తల్లిదండ్రులకు ఫోన్ చేసి వీడియో కాల్‌లో చూపించారు. వారు రావడంతో ట్రాఫిక్ ఎస్‌ఐ గరగారావు బాలుడిని అప్పగించారు. తమ కుమారుడిని క్షేమంగా అప్పగించిన ట్రాఫిక్ ఎస్‌ఐ గరగారావు, పోలీసులకు తండ్రి బాంటీరామ్ వల్లీయప్పన్ కృతజ్ఞతలు తెలిపాడు.

పంటబోదెలో మృతదేహం

ద్రాక్షారామ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామ- కోటిపల్లి రోడ్డు పక్క పంటబోదెలో అన్నాయిపేటకు చెందిన గట్టి సతీష్ (44)మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. మృతుడి భార్య గట్టి పెద్దింట్లమ్మ ఫిర్యాదుతో హెచ్‌సీ సూర్యనారాయణ కేసు నమోదు చేశారు. సతీష్‌కు తరచూ ఫిట్స్ వస్తుంటాయి. 2రోజుల క్రితం బయటకు వెళ్లిన సతీష్ తిరిగిరాలేదు. ఫిట్స్ వచ్చి పడిపోయి ఉంటాడని, తన భర్త మరణంపై ఎటువంటి అనుమానాలు లేవని భార్య ఫిర్యాదులో పేర్కొందని పోలీసులు తెలిపారు.

తుపాకీతో సంచారం

పోలీసుల అదుపులో అనుమానితుడు

కాకినాడ క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు స్టేట్ బ్యాంక్ సమీపంలో తుపాకీతో సంచరిస్తున్న ఓ అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని తిమ్మాపురం పోలీసులు కాకినాడ రూరల్ పోలీస్ కార్యాలయానికి తరలించారు. సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. సదరు వ్యక్తి బ్యాంక్ కొల్లగొట్టడానికి వచ్చాడన్న ప్రాథమిక సమాచారంతో విచారణ చేపట్టారు. వాస్తవాలు వెల్లడి కావడంతో ఆ దిశగా పోలీసులు నిర్ధారణ చేసుకున్నారు. అనుమానితుడిని పోలీసులు విచారిస్తున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

21, 22 తేదీల్లో ఐడియల్ కళాశాలలో జాతీయ స్థాయి సదస్సు

కాకినాడ రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ విద్యుత్ నగర్‌లోని ఐడియల్ కళాశాల క్యాంపస్‌లో 'మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్, గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఇండియా' అంశంపై ఈ నెల 21, 22 తేదీల్లో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్టు అకడమిక్ డైరెక్టర్ ఎం.రంజిత్ తెలిపారు. ఏపీ ఎంఎస్ఎంఈ చైర్మన్ టి.శివశంకరరావు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారన్నారు. దేశ ఆర్థిక వృద్ధిలో యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలనే ఆలోచనతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు చీఫ్ ప్యాట్రన్, కళాశాల కరస్పాండెంట్, కార్యదర్శి డాక్టర్ పి.చిరంజీవినీకుమారి తెలిపారు. ప్రముఖ విద్యావేత్తలు ప్రొఫెసర్ సుదర్శనరావు, హిమాచలం దాసరాజు, ఖలీబు, ప్రసాదరావు హాజరవుతారన్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధనా పేపర్లను పంపిస్తున్నారన్నారు. సదస్సుకు ప్యాట్రన్‌గా ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ, సమన్వయకర్తగా వి.నాగేశ్వరరావు, కన్వీనర్‌గా డాక్టర్ స్టీవెన్ రాజు వ్యవహరిస్తారని చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమంపై కూటమి ప్రభుత్వం దృష్టి: ఎమ్మెల్సీ పేరాబత్తుల


చిన్నారికి పలక, పెన్సిల్ అందజేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ రాజశేఖర్

కాకినాడ సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని, అన్ని వర్గాల ప్రజల కోసం పాటుపడుతోందని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పేర్కొన్నారు. నగరంలోని 27వ డివిజన్ ఇన్‌చార్జి కోడూరి పెద్ద, అమలకంటి బలరాం, రెడ్నం సత్తిబాబు, మంగ సత్యనారాయణ, చింతలపూడి రవిలతో కలిసి ఎమ్మెల్సీ రాజశేఖర్ మంగళవారం పట్టభద్ర ఓటర్లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత విద్యకు శిక్షణ పొందుతున్న తేజశ్రీ, మంగాదేవిలను కలిసి వారి చదువుకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ల లక్ష్యాలను అధిగమించేలా కృషి చేస్తానన్నారు. టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ జిల్లా అధ్యక్షుడు వనమాడి మోహనవర్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు పలకలు, పెన్సిళ్లు అందజేశారు.

'అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి'


మినీ గోకులాన్ని పరిశీలిస్తున్న 'పాడా' ప్రాజెక్టు డైరెక్టరు చైత్రవర్షిణి

గొల్లప్రోలు రూరల్/పిఠాపురం రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని 'పాడా' ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి అధికారులను ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పిఠాపురం మండలం కుమారపురంలో నిర్మించిన మినీ గోకులం, సీసీ రోడ్డు, కల్వర్టు పనులను, ఎఫ్‌కే పాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. అక్కడి కూలీలతో మాట్లాడారు. గ్రామంలో జరుగుతున్న బండ్ ప్లాంటేషన్, ట్యాంక్ డీసిల్టేషన్, కంపోస్టు పిట్ పనులను పరిశీలించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి బీటీ రోడ్డు పనులను, చెందుర్తి, వన్నెపూడి గ్రామాల్లో ఫార్మ్ పాండ్ పనులను తనిఖీ చేశారు. పనులు నాణ్యతతో జరిగేలా శ్రద్ధ వహించాలని సూచించారు. పీడీ వెంట ఏపీడీ వసంతమాధవి, ఏపీవోలు కొండలరావు, నాయుడు, పంచాయతీరాజ్ ఏఈ కృష్ణమోహన్, ఇంజనీరింగ్ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

కనీస పెన్షన్ మంజూరు చేయాలి

ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న 75లక్షల మంది ఈపీఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షను రూ.9వేలు డీఏతో కలిపి మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ కాకినాడ ఈపీఎఫ్‌వో కార్యాలయాన్ని పెన్షనర్లు మంగళవారం ముట్టడించారు. ఆల్ ఇండియా కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఈపీఎఫ్ పెన్షనర్స్ ఆర్గనైజేషన్స్ పిలుపుమేరకు ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రమణమూర్తి అధ్యక్షతన ఈపీఎఫ్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తిరాజు మాట్లాడుతూ 13సంవత్సరాలుగా ఈపీఎఫ్ పెన్షనర్ల పట్ల చాలా నిర్లక్ష్యం వైఖరి అవలంబిస్తున్నారన్నారు. 36 లక్షల మంది పెన్షనర్లు కనీస పెన్షన్ వెయ్యి రూపాయలు కూడా పొందలేని పరిస్థితులు దేశంలో ఉన్నాయన్నారు. ఈపీఎఫ్ వద్ద 8లక్షల 88వేల కోట్ల రూపాయల కార్పస్ ఫండ్ ఉందన్నారు. దానిపై ప్రతిఏటా రూ.52వేల కోట్లు వడ్డీ రూపంలో వస్తున్నా కేవలం 14వేల కోట్లు మాత్రమే పెన్షన్ల రూపంలో చెల్లిస్తున్నారన్నారు. కేంద్రం ఒకపక్క కార్పొరేట్లకు రాయితీలను ప్రకటించి బ్యాంకు రుణాలను వేల కోట్లలో రద్దు చేస్తోందన్నారు. ఈపీఎఫ్ కనీస పెన్షన్ మంజూరు చేయమంటే నిధుల లేమి పేరుతో కుంటిసాకులు చెప్తోందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కర్రి బాబూరావు, జిల్లా నాయకులు యూఎస్ఎన్ రెడ్డి, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు త్రిమూర్తులు, సీహెచ్ వెంకటరమణ, రాందాస్, సత్యనారాయణ, జార్జ్‌బర్నబస్ తదితరులు పాల్గొన్నారు.


జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం ఇస్తున్న బీఎంఎస్ ప్రతినిధులు

ఈపీఎఫ్ పెన్షన్‌ను రూ.5వేలకు పెంచాలి

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రతినిధులు తాళ్లూరి జగదీష్ ఆధ్వర్యంలో మంగళవారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను కలిశారు. ఈపీఎఫ్-95 పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థల విశ్రాంత ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చే పెన్షన్‌ను వెయ్యి నుంచి రూ.5వేలకు పెంచాలని కోరారు. దేశవ్యాప్తంగా ఇటువంటి వారు సుమారు 78 లక్షల మంది ఉన్నారని, వారికి పెన్షన్ పెంచడంతో పాటు డీఏ కూడా ఇవ్వాలన్నారు. ఆయుష్మాన్‌భారత్ పథకం ఆరోగ్య కార్డులు అందించే నిర్ణయం తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. బీఎంఎస్ ప్రతినిధులు పీఆర్వీ రావు, బి.అప్పారావు, పి.వీరాంజనేయులు, ప్రవీణ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శృంగారవల్లభ స్వామి హుండీల ఆదాయం రూ.28.10 లక్షలు


ఆదాయ వివరాలు వెల్లడిస్తున్న ఈవో శ్రీనివాసరావు

పెద్దాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తొలి తిరుపతిలోని శృంగారవల్లభ స్వామి ఆలయ హుండీలను దేవదాయ, రెవెన్యూ, పోలీసు శాఖల సమక్షంలో మంగళవారం తెరిచి లెక్కించారు. 90 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.21,40,696, అన్నదాన హుండీల ద్వారా రూ.6,69,950.... మొత్తం రూ.28,10,646 ఆదాయం వచ్చిందని ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. లెక్కింపులో దేవదాయ శాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.ఫణీంద్రకుమార్, సర్పంచ్ మెయిళ్ల కృష్ణమూర్తి, అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, కాండ్రకోట చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది లావణ్య, హరిబాబు పాల్గొన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'


ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద చెత్తను సేకరిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

జేఎన్టీయూకే, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యకరంగా ఉంటారని జేఎన్టీయూకే ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ పేర్కొన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, హైదరాబాద్‌లోని ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ డైరెక్టరేట్ సూచనల మేరకు జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడ ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద పరిశుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ అధ్యక్షతన చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ డైరెక్టర్ ఎం.రామకృష్ణ సహకారంతో 200 మంది వలంటీర్లు చెత్తను సేకరించారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

బీసీల జనగణన తక్షణం చేపట్టాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు


సంఘీభావం చాటుతున్న బీసీ సంఘాల నాయకులు, నూతన కమిటీ సభ్యులు

కాకినాడ సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వెనుకబడిన బీసీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణం బీసీల జనగణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైనాగేశ్వరరావు యాదవ్ డిమాండ్ చేశారు. బాలాజీచెరువు సెంటర్ వద్ద గల కాస్మోపాలిటన్ క్లబ్ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటుచేసిన బీసీ సంక్షేమ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు స్థానిక జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో కేటాయింపులు కల్పించాలని కోరారు. బీసీల అభివృద్ధి, సంక్షేమానికి బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో ఏబీసీడీ వర్గీకరణ చేసిన విధంగానే రాజకీయ రంగంలో కూడా వర్గీకరణ చేపట్టి ఎంబీసీ కులాలకు న్యాయం చేయాలన్నారు. లబ్ధిదారులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులతో సంబంధం లేకుండా బీసీ కార్పొరేషన్ల ద్వారా నేరుగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఐదు ఎమ్మెల్సీ పదవుల్లో రెండింటిని బీసీలకు కేటాయించడం హర్షణీయమన్నారు.

సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలను గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ కోటా తగ్గించిందన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఆమె ప్రకటించారు.

కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా గుత్తుల శ్రీనివాస్, యూత్ జిల్లా అధ్యక్షుడిగా కొల్లుబోయిన శ్రీనివాసయాదవ్, ప్రధాన కార్యదర్శిగా మాసుమేను గంగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడిగా వాసంశెట్టి భీమరాజు, యూత్ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, కార్యదర్శిగా తంగెళ్ల సత్యనారాయణ, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా కొమ్మన తాతారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు చొల్లంగి వేణుగోపాల్, రాయుడు నాగేశ్వరరావు, సుందరనీడి గోపాలకృష్ణ, ఉమాశంకర్, మేడిశెట్టి లక్ష్మణరావు, బి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్స్ ఏర్పాటు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా

అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే నానాజీ



సర్పవరం జంక్షన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగ సంస్కరణల్లో భాగంగా జీవో నెం.117 సవరణ చేసి ప్రభుత్వ స్కూల్స్, కళాశాలల్లో మోడల్స్ స్కూల్స్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. మంగళవారం ఆయన అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడారు. ప్రైవేట్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్నో, డిజిటల్స్‌లలో నిబంధనలు పాటిస్తున్నారా, లేదా, జీప్లస్ వన్ దాటిన స్కూల్స్ సముదాయాల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు, ఫస్ట్ ఎయిడ్ వ్యవస్థ అందుబాటులో ఉంటున్నాయా లేదో తెలిజేయాలని కోరారు. అధిక ప్రైమరీ స్కూల్లులో మెట్లు ఇరుగ్గా ఉంటున్నాయని, ప్రమాదం, అత్యవసర సమయాల్లో సురక్షితంగా కిందకు రావడానికి అవకాశం ఉండట్లేదన్నారు. పిల్లల శారీరక ఆరోగ్యం కోసం స్కూల్స్‌లో డ్రిల్ మాస్టర్లు ఉండాలన్నారు. క్రీడలతో ఆరోగ్యంతో పాటు శారీరక ధృడత్వం లభిస్తుందన్నారు. క్రీడలు, పీఈటీలు లేక విద్యార్థులకు శారీరక శ్రమ, ఊబకాయం వంటి రుగ్మతలకు గురవుతున్నారన్నారు. గతంలో ప్రభుత్వ స్కూల్స్‌లో డ్రిల్, డ్రాయింగ్ పిరియడ్లు ఉండేవన్నారు. ఎన్‌సీసీ యూనిట్లు ఉండేవని, ప్రస్తుతం అన్ని స్కూల్స్, కాలేజీల్లో ఎన్‌సీసీ బలోపేతం కోసం తీసుకుంటున్న చర్యలను వివరించాలని కోరారు. ప్రైవేట్ స్కూల్స్‌యాజమాన్యాలు మెరుగైన ఫలితాల కోసం బాగా చదివే 10 శాతం విద్యార్థులపై దృష్టి పెట్టి, 90 శాతం మందిని పట్టించుకోవట్లేదన్నారు.

ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 1,200 మంది ఓటర్లు ఉండేలా చర్యలు


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మల్లిబాబు

సర్పవరం జంక్షన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 1,200 మంది ఓటర్లు ఉండేలా ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోందని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఎస్.మల్లిబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 1,33,595 మంది పురుషులు, 1,36,009 మంది మహిళలు, 9 మంది ఇతర ఓటర్లు ఉన్నారన్నారు. 1,200 మంది కంటే ఎక్కువ మంది ఉంటే రెండు కిలోమీటర్ల పరిధిలో కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ భవనాలతో పాటు అధికంగా ఓటర్లు కలిగి ఉన్న అపార్టుమెంట్లు, సమూహాల మధ్య ఒక రూమ్ కేటాయిస్తే అక్కడే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని భారత ఎన్నికల సంఘం సూచించిందన్నారు. ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా ధ్యేయంగా బీఎల్వోలు, బీఎల్ఏలు పని చేయాలని కోరారు. సమావేశంలో తహసీల్దారు ఎస్ఎల్ఎన్ కుమారి, డిప్యూటీ తహసీల్దార్లు కల్యాణచక్రవర్తి, కేఎల్ సురేష్‌కుమార్, ఆర్ఐ ఎంవీడీ భవాని, రాజకీయ పార్టీల ప్రతినిధులు వైపీ శ్రీనివాస్, గదుల సాయిబాబు, రమణమూర్తి, టి.నాగేశ్వరరావు, కేవీ లింగరామయ్య, ఎస్.అప్పారావు పాల్గొన్నారు.



పోషకాహార పునరావాస కేంద్రానికి టీచింగ్ ఎయిడ్స్ వితరణ

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అదానీ ఫౌండేషన్ ఫార్చ్యూన్ సుపోషన్‌లో భాగంగా మంగళవారం కాకినాడ జీజీహెచ్‌లోని పోషకాహార పునరావాస కేంద్రం (ఎన్ఆర్‌సీ) సెంటర్‌కు పిల్లల సౌకర్యార్థం పలు ఆటబొమ్మలు, మెదడు అభివృద్ధికి దోహదం చేసే పలు రకాల టీచింగ్ ఎయిడ్స్‌ని విల్‌మార్ సంస్థ ప్లాంట్ మేనేజర్ శరవణన్ అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌సీ సెంటర్ హెడ్ మాణిక్యాంబ, అదానీ ఫౌండేషన్ సిబ్బంది, ఎన్ఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయలో ముగిసిన 'పది' పరీక్షలు

సర్పవరం జంక్షన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ పి.వెంకటాపురంలోని కేంద్రీయ విద్యాలయలో పదో తరగతి సీబీఎస్ఈ పరీక్షలు మంగళవారం ముగిసాయి. విద్యార్థులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని ఆలింగనం చేసుకున్నారు. యూనిఫారాలపై గుర్తుగా సంతకాలు చేసుకున్నారు.

పోలీసుల అదుపులో ఆకతాయిలు

సామర్లకోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బాలికలపై ఆకతాయిల దౌర్జన్యం పేరిట 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం వచ్చిన వార్తకు జిల్లా పోలీసు ఉన్నతాధికారి స్పందించి సత్వరం చర్యలు తీసుకోవాలని సామర్లకోట పోలీసులను ఆదేశించారు. మంగళవారం వారు వేట్లపాలెం వెళ్లి దర్యాప్తు నిర్వహించి పదో తరగతి విద్యార్థినులపై దౌర్జన్యానికి పాల్పడిన ముగ్గురు ఆకతాయిలను గుర్తించి సామర్లకోట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బందోబస్తు పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలతో వారిని బందోబస్తు విధుల నుంచి తప్పించాలని ఆదేశించినట్టు తెలిసింది. కాగా పోలీసుల అదుపులో ఉన్న వారిలో ఒక యువకుడికి గతంలో పలు ఘటనల్లో నేర చరిత్ర ఉన్నట్టు సమాచారం.

రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి


వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ రమేష్

కాకినాడ క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) రోడ్డు ప్రమాదాల నియంత్రణకు రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని కాకినాడ ట్రాఫిక్ సీఐలు రమేష్, రామారావు కోరారు. ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్ ఆధ్వర్యంలో మంగళవారం టౌన్‌హాల్ సెంటర్‌లో కొత్తగా అమల్లోకి వచ్చిన ట్రాఫిక్ జరిమానాలు, హెల్మెట్ వినియోగంపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. సీఐలు మాట్లాడుతూ ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ ధరించి విలువైన జీవితాన్ని నిండు నూరేళ్ల ఆనందంగా చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే నూతన మోటార్ వెహికల్ చట్టం ప్రకారం భారీ జరిమానా విధిస్తామని చెప్పారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తాం: ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వీరబాబు

పిఠాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఏలేరు ఆయకట్టు పరిధిలో ప్రతి ఎకరానికీ సాగునీరు అందిస్తామని ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు తెలిపారు. ఏలేరు ఆయకట్టులోని పొలాలకు సాగునీరు అందడంలో ఇబ్బందులు ఉన్నట్టు రైతుల నుంచి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో పిఠాపురం మండలం గోకివాడ, రాపర్తి, భోగాపురం, బి.ప్రత్తిపాడు గ్రామాలతో పాటు శివారు ఆయకట్టు ప్రాంతాలను ఇరిగేషన్ అధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. శివారు ఆయకట్టు వరకు సాగునీరు చేరేలా అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఊటా ఆదివిష్ణు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, ఇరిగేషన్ డీఈఈ రవికుమార్ పాల్గొన్నారు.

'ఎరువుల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి'

పిఠాపురం రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులను వినియోగించాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకురాలు మాధవి, పిఠాపురం వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి సూచించారు. పిఠాపురం మండలం పి.రాయవరం, బి.ప్రత్తిపాడు గ్రామాల్లోని రైతులకు మంగళవారం వారు భూసార పరీక్షల కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సామర్లకోట భూసార పరీక్షా కేంద్రం ఏవో సుధామాధురి, పిఠాపురం ఏవో అచ్యుతరావు, వీఏఏలు నాయుడు, సత్యవినోద్, బి.ప్రత్తిపాడు సర్పంచ్ ఊటా రామకృష్ణ, ఏలేరు ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఊటా ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఆశీలు బహిరంగ వేలం మరోసారి వాయిదా

గొల్లప్రోలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో జనరల్ డైలీ మార్కెట్, రోడ్డు మార్జిన్లల్లో ఆశీలు వసూలు చేసుకునే హక్కుకు మంగళవారం వేలం నిర్వహించారు. కనీస పాట మొత్తాన్ని తగ్గించాలని హాజరైన వారు కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన కనీస మొత్తానికే వేలం జరుగుతుందని అధికారులు చెప్పడంతో వారు ఆసక్తి చూపలేదు. దీంతో వాయిదా వేసి తిరిగి ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహిస్తామని కమిషనరు కనకారావు తెలిపారు.

16 మంది వాహనచోదకులకు రెండు రోజులు జైలు శిక్ష

కాకినాడ క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కాకినాడ సిటీ పరిధిలో రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే ఉద్దేశ్యంతో ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ 1,2 పోలీస్‌స్టేషన్ల పరిధిలో సీఐలు రమేష్, రామారావు ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. 38 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్టు నిర్ధారించారు. వారిని కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టారు. 16 మందికి తలో రెండు రోజులు చొప్పున జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి డి.శ్రీదేవి తీర్పునిచ్చారు. మరో 22 మందికి తలో రూ.10 వేలు వంతున రూ.2.20 లక్షలు జరిమానా విధించారు.

'మహిళలు ఆర్థికంగా ఎదగాలి'


మహిళా ఉన్నతి పథకంలో రుణాలు అందించిన జనసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు

పిఠాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి పథకాల ద్వారా ఆర్థికంగా ఎదగాలని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సూచించారు. ఎస్సీ మహిళా ఉన్నతి పథకంలో భాగంగా ఆరుగురు మహిళలకు రూ.7 లక్షల సబ్సిడీ రుణాలను మంగళవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎంలు సకీనా, తౌడు, సన్యాసిరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రభుత్వాసుపత్రిలో నిత్యాన్నదానం

పిఠాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి (సీహెచ్‌సీ)లో బుధవారం నుంచి గర్భిణులకు ఉచిత నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు సంస్థ ప్రతినిధి రవికుమార్ తెలిపారు.



ఉప రాష్ట్రపతిని పరామర్శించిన ఎంపీ సతీష్‌బాబు

కాకినాడ సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం కోలుకున్న భారత ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్‌ను మంగళవారం రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు పరామర్శించారు. ఢిల్లీలోని ఉప రాష్ట్రపతి చాంబర్‌లో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

చినవెంకటరెడ్డి నేత్రాల దానం

తాళ్లరేవు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పోలేకుర్రు పంచాయతీ తోటపేట గ్రామానికి చెందిన దున్నా చినవెంకటరెడ్డి (59) మంగళవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యుల అంగీకారంతో సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు. వెంకటరెడ్డి కుటుంబీకులను టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వడ్లమూరి సతీష్, జక్కుల ప్రసాద్‌బాబు, వూడా ప్రసన్నకుమార్, వెంకటరామకృష్ణ, బల్ల చిరంజీవి, దడాల సత్తిబాబు, నేతల నాగార్జున పరామర్శించారు.

'పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి'

తాళ్లరేవు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తాళ్లరేవు విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు మంగళవారం తహసీల్దారు పితాని త్రినాథరావుకు వినతిపత్రం అందించారు. అధ్యక్షుడు రామకృష్ణయ్య, కార్యదర్శి అత్తిలి సత్యనారాయణ, కోశాధికారి దడాల వెంకన్న, ఎలిపే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాదగయ పుష్కరిణిలో నీరు తొలగింపు

పిఠాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించారు. ఇంకా పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత కొత్త నీరు పెట్టనున్నారు. అప్పటివరకు భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు.

ఇరిగేషన్ కాలువలపై ఆక్రమణలు తొలగించాలి: సీపీఐ

పిఠాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయంతో పాటు పట్టణం మీదుగా వెళ్తున్న ఏలేరు (చెరుకుల) కాలువ, జగ్గయ్యచెరువు కాలనీ సమీపంలో, బైపాస్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న కాలువలన్నీ ఆక్రమణలకు గురయ్యాయని సీపీఐ కార్యదర్శి సాకా రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పిఠాపురం నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఏఈఈ ప్రసన్నకుమార్‌ను కలిసి ఆక్రమణలను తొలగించాలని వినతిపత్రం అందజేశారు.

'హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యమివ్వాలి'

తాళ్లరేవు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యమివ్వాలని కోస్టల్ నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్ పీపుల్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు ఎం.రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన తాళ్లరేవు అంబేడ్కర్ భవనంలో యానాం ప్రాంతానికి చెందిన లబ్ధిదారులకు హెచ్ఐవీపై పూర్తి అవగాహన కల్పించారు. సభ్యులు చిట్టితల్లి, డేవిడ్‌రాజ్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

'బీసీల ఉన్నతికి సహకరించాలి'

తుని రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాల ఉన్నతికి సహకరించి వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల గణేష్‌కుమార్ స్పష్టంచేశారు. కాకినాడలో డీఆర్‌డీఏ ఆఫీస్‌లో డిప్యూటీ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి గణేష్‌కుమార్ హాజరై గవర సామాజిక వర్గ సమస్యలతో పాటుగా పలు ఉపకరాల కోసం చర్చించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఆర్అండ్ఆర్ జాబితా తనిఖీ


పీవో భరత్‌ను కలిసిన కూటమి నాయకులు

వీఆర్‌పురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రేఖపల్లిలోని తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆర్అండ్ఆర్ జాబితాను తనిఖీ చేశారు. పీడీఎఫ్ జాబితాలో పేర్లు కూనవరం, వీఆర్‌పురానికి సంబంధించిన పోలవరం నిర్వాసితులు దరఖాస్తులను తహశీల్దార్ కార్యాలయంలో ఐటీడీఏ పీవో స్వయంగా స్వీకరించి, నిర్వాసితులకు భరోసా ఇచ్చారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం కూటమి నాయకులు పీవోను కలసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారానే నిర్వాసితులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బొర్ర నరేష్‌కుమార్, ములకాల సాయికృష్ణ, బీరక సూర్యప్రకాశరావు, బొర్ర నరసింహరావు, ముత్యాల చంద్రశేఖర్, ముత్యాల సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా డ్వాక్రా రుణాల మంజూరు

ఆపై తిరిగి తీసేసుకున్న యూనియన్ బ్యాంకు అధికారులు.. డ్వాక్రా మహిళల ఆందోళన

రాజవొమ్మంగి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయం వద్ద మంగళవారం డ్వాక్రా మహిళలు ఆందోళన చేపట్టారు. తంటికొండ పంచాయతీ వట్టిగడ్డ గ్రామానికి చెందిన 33 డ్వాక్రా సంఘాలు రాజవొమ్మంగి యూనియన్ బ్యాంకులో ఉన్నాయి. ఇందులో 15డ్వాక్రా సంఘాల్లో సభ్యుల అనుమతులు, ఎటువంటి సమాచారం లేకుండా డ్వాక్రా రుణాలు మంజూరుచేసి బ్యాంకు ఖాతాలో జమ చేసి, తిరిగి బ్యాంకు వారే తీసుకున్నారని వట్టిగడ్డ గ్రామానికి చెందిన కావేరి, సంధ్య, వనిత, దివ్య, ప్రియదర్శిని, రమ్య, సాయి తదితర గ్రూపులకు చెందిన సుమారు వందమంది డ్వాక్రా మహిళలు నిరసన తెలిపారు. తమకు రుణాలు మంజూరైనట్లు గాని, డబ్బులు వేసి, మళ్లీ తీసినట్లు గాని ఎటువంటి విషయాలు తెలియదన్నారు. దీని వల్ల రూ.51 వేలు వడ్డీ 15 గ్రూపుల సభ్యులకు భారంగా మారిందని ఏపీఎం రామాంజనేయులు, ఎంఎంఎస్‌లను డ్వాక్రా మహిళలు నిలదీశారు. దీనిపై స్పందించిన వారు వట్టిగడ్డ గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకున్నారు. రుణాల మంజూరు విషయంపై చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మోతుగూడెం డ్రైనేజీల్లో పూడిక తీతలు

మోతుగూడెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం మేజర్ పంచాయతీలో దీర్ఘకాలికంగా నెలకొన్న డ్రైనేజీల్లో పూడిక సమస్యను గ్రామ కార్యదర్శి జి.మోహన్ పరిష్కరించారు. నాలుగు రోజులుగా గ్రామంలోని అన్ని డ్రైనేజీల్లో పూడికను 15మంది కూలీలతో తీయిస్తున్నామని చెప్పారు. పదేళ్ల నుంచి డ్రైనేజీలు పూడికతో నిండిపోవడంతో వర్షాకాలంలో మురుగు నీరు రోడ్లపై ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ గ్రామాన్ని సందర్శించినప్పుడు గ్రామస్థులు, టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు సమస్యలను పీవో దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పీవో స్పందించి డ్రైనేజీల్లో పూడికలు తీయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. దీంతో పూడిక తీత పనులు చేపట్టారు.

తాగునీటి సమస్య తీర్చాలంటూ బిందెలతో నిరసన

ఎటపాక, మార్చి 18(ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం పంచాయతీ బురుగువాయి తండాలో తాగునీటి సమస్య తీర్చాలంటూ మంగళవారం గ్రామస్థులు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా గ్రామానికి సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్లు ధ్వంసం కావడంతో తాగునీరు సరఫరా నిలిచిపోయిందన్నారు. ఏడాది కావస్తున్నా పైపులైన్లకు మరమ్మతులు చేపట్టలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. బుధవారం చింతూరులో ఐటీడీఏ పీవోను కలిసి సమస్యపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తండాలోని చేతిపంపులు కూడా పనిచేయట్లేదని పేర్కొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు

ఎటపాక, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఎటపాక మండలం గౌరిదేవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు కూనవరం మండలం నర్సింగ్‌పేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, వరరామచంద్రాపురం మండలం సున్నం వారిగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు సీసీ కెమెరాలు చేసినట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

రమేష్‌కు ఘన నివాళి

రంపచోడవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు రమేష్ 6వ వర్ధంతిని రాకోట గ్రామంలో మంగళవారం బి.బొజ్జిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ చిత్ర పటానికి పూలమాలలతో నివాళులర్పించారు.పార్టీ నాయకుడు ఎం.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రమేష్ 45ఏళ్లు గిరిజనుల హక్కుల సాధనకు కృషి చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా తుది శ్వాస వరకు పోరాడారన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకుడు జె.సత్తిబాబు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి గుబ్బల ఆదినారాయణ, ఇప్టు నాయకుడు కేబొజీఆర్ రాఘవులు, బి.శ్రీదేవి, పండెల సోమన్న, కత్తుల సోమిరెడ్డి, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, కె.గంగిరెడ్డి పాల్గొన్నారు.

వీఆర్ పురంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

వీఆర్‌పురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వీఆర్ పురంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి ఏవీ రమణ, సర్పంచ్ సోడి నర్సమ్మ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ సెంటర్ నుంచి రాజీవ్‌గాంధీ సెంటర్ మీదుగా అంబేడ్కర్ కాలనీ వరకు డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని పారిశుధ్య కార్మికులతో పూర్తిగా తొలగించారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటికి ఎద్దడి లేకుండా వీఆర్‌పురంలో ఉన్న అన్ని విద్యుత్ మోటార్లు పనిచేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు.

పూడ్చిపెట్టిన బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం

వై.రామవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాలుడి మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్‌ఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. ఈనెల 8న పెదఊలెంపాడు గ్రామ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొనడంతో గ్రామానికి చెందిన కర్రా స్వామిరెడ్డి కుమారుడు మూడేళ్ల బాలుడు జశ్విక్‌రెడ్డి మృతి చెందాడు. ప్రమాదంపై ఈనెల 17వ తేదీ సాయంత్రం బాలుడి తల్లి నాగదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో గ్రామంలో పూడ్చిపెట్టి ఉన్న బాలుడి మృతదేహాన్ని వెలికితీసి శవపంచనామా, పోస్టుమార్టం జరిపినట్టు ఎస్‌ఐ తెలిపారు. తదుపరి దర్యాప్తు సాగిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శాంతకుమారి, వీఆర్వో గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వింత రోగంతో రెండు ఆవులు మృతి

రాజవొమ్మంగి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మారేడుబాక పంచాయతీ ఉర్లాకులపాడు గ్రామానికి చెందిన గిరిజన రైతు కోసూరి రాజుబాబుకు చెందిన ఆవు పొలం వద్ద పశువుల పాకలో మెడలు వెనక్కి విరుచుకుపోయి నోటి నుంచి సొంగలు కారుస్తూ మృతి చెందింది. నాలుగు రోజుల క్రితం ఇలా ఓ ఆవు చనిపోయిందని రాజుబాబు విలపిస్తున్నాడు. ఆరోగ్యంతో ఉన్న ఆవులు మృతిచెందడంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పశు వైద్యాధికారులు స్పందించి ఆవులకు వైద్యం అందించాలని కోరుతున్నారు. రెండు ఆవుల విలువ రూ.లక్ష ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని రాజబాబు కోరుతున్నాడు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు.. గేదె అడ్డురావడంతో ప్రమాదం

దేవీపట్నం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. మంటూరు గ్రామానికి చెందిన పండల సూర్యప్రకాశ్‌రెడ్డి(32), చెదల రామిరెడ్డి బైక్‌పై మంటూరు గ్రామానికి వస్తుండగా పోతవరం గ్రామ శివారున సోమవారం రాత్రి గేదె అడ్డురావడంతో అదుపుతప్పి పడిపోయారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వార్ని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సూర్యప్రకాశ్‌రెడ్డి మంగళవారం మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు.

ఘనంగా అన్నవరెడ్డి రాజులబాబు పండుగ

రంపచోడవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలో అన్నవరెడ్డి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం అన్నవరెడ్డి రాజుల పండుగను హిందూ సంస్కృతి, సంప్రదాయాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడిచెట్టులో అన్నవరెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో బాపిరాజు, భగవాన్, శేరు సత్యనారాయణ, సీహెచ్ బుజ్జి, వి.భద్రం, సుబ్బారావు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

బీజేపీ విజయానికి బూత్ కమిటీలే కారణం

● జిల్లా బీజేపీ అధ్యక్షుడు విశ్వేశ్వరరావు


రాచపల్లిలో మాట్లాడుతున్న జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు

ప్రత్తిపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బీజేపీ విజయానికి బూత్ కమిటీలే కారణమని జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని రాచపల్లి అడ్డురోడ్డు వద్ద మంగళవారం సాయంత్రం నిర్వహించిన నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల సమావేశానికి నియోజకవర్గ కన్వీనర్ సింగిలిదేవ్ సత్తిరాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా బిక్కిన మాట్లాడుతూ దేశంలోని 21 రాష్ట్రాల్లో బీజేపీ కూటమి ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయన్నారు. ఈ విజయానికి ప్రధాన కారణం బూత్ స్థాయిలో కమిటీలుసమర్థవంతంగా పనిచేయడమేనన్నారు. నియోజకవర్గంలో 227 బూత్‌లకు సంబంధించి 268బూత్ కమిటీలు ఏర్పడ్డాయని మిగిలినవి త్వరలోనే ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గవ్యాప్తంగా గ్రామాల్లో 1000 ఇళ్లపై రాబోయే పక్షం రోజుల్లో బీజేపీ జెండాలు రెపరెపలాడాలని కార్యకర్తలకు సూచించారు. శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లను నియమించాలన్నారు. సమావేశంలో జిల్లా బీజేపీ నాయకులు మట్టా మంగరాజు, ఉమ్మడి వెంకట్రావు, ఎస్.సత్తిరాజు, కొల్లా శ్రీనివాస్, ఊటా వీరబాబు మాట్లాడారు. బిక్కినను మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వి.వీరబాబు, నానిపల్లి శ్రీనివాస్, రామకుర్తి సూర్యనారాయణ, నానిపల్లిసత్యనారాయణ, గొనగాల గోపీలు, గొన్నాబత్తుల రాజబాబు, కందా వీరాస్వామి శాలువా కప్పి సన్మానించారు. ప్రత్తిపాడు, జగ్గంపేట నాయకులు గంటా బాలుదొర, కామినేని జయశ్రీ, వర్మ, లౌడు శ్రీనివాస్, శెట్టిగంగబాబు, దేవర రామకృష్ణ, కించు జోగిరాజు, తేజోమూర్తుల ఉషారాణి, లిక్కి పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

జగ్గంపేట: బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. నియోజకవర్గంలో జగ్గంపేట, గండేపల్లి, గోకవరం మండలాల సమావేశం జగ్గంపేట టౌన్ హాల్‌లో నియోజకవర్గ కన్వీనర్ సాహితీ వర్మ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ముఖ్య అతిథి బిక్కిన మాట్లాడుతూ మండలంలోని ఉన్న ప్రతి బూత్ కమిటీ 100శాతం పూర్తిచేసి, రాబోయే రోజుల్లో స్థానిక ఎన్నికలకు పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు మట్టా మంగరాజు, గండి కొండలరావు (నాని), డీవీఎన్ రాజు, జిల్లా ఉపాధ్యక్షురాలు కామినేని జయశ్రీ, చోడిశెట్టి రమేష్ బాబు, జగ్గంపేట అసెంబ్లీ కన్వీనర్ కోన వెంకట సురేష్, మండలాధ్యక్షుడు పల్లా రావు, గండేపల్లి మండలాధ్యక్షుడు తోరాటి వెంకన్న, గోకవరం మండలాధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర తదితరులు పాల్గొన్నారు.

జనసేన చొరవతో మలేషియా నుంచి స్వదేశానికి మహిళ

జగ్గంపేటరూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపురం గ్రామానికి చెందిన గంగనకుర్తి చంద్రావతి ఉపాధి నిమిత్తం మలేషియా వెళ్లింది. అక్కడ ఆమెకు ఉపాధి కరువైంది. దీంతో ఏజెంట్ తనను మోసం చేశాడని గ్రహించింది. ఎవరికీ చెప్పుకోవాలోతెలియక కాలం వెళ్లదీస్తూ గడుపుతుంది. ఈ తరుణంలో విజయవాడలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే జనవాణి కార్యక్రమంలో చంద్రావతి కుటుంబ సభ్యులు తమ అర్జీని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు అందించారు. ఆయన తన అనుచరులతో దాసరి కిరణ్, మలేసియా ఎన్నారై టీంపోడర్ దాసరి శ్రీరాముకు విషయాన్ని వివరించారు. శ్రీరాము లు టీం మలేషియాలో ఉంటున్న చంద్రవతి వివరాలను సేకరించి అక్కడి అధికారులను సంప్రదించారు. చంద్రావతికి అక్కడ అధికారులు జరిమానా విధించారు. శ్రీరాములు టీం ఆ జరిమానాన్ని చెల్లించి దగ్గరుండి స్వదేశానికి పంపే ఏర్పాట్లను పర్యవేక్షించారు. అక్కడ నుంచి విమానంలో విశాఖపట్నం పంపించేందుకు విమాన టిక్కెట్లను యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సహాయం అందించినట్లు తెలిసింది. ప్రస్తుతం చంద్రతి స్వదేశానికి చేరుకుంది.

డొక్కాసీతమ్మ ఉచిత క్యాంటీన్ ఏర్పాటు

జగ్గంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో పాత పోలీస్‌స్టేషన్ వద్ద ప్రతి మంగళవారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. జనసేన నాయకులు కురుమల్ల నాగేశ్వరరావు, రాజనాల శ్రీను, సూరప రెడ్డి నరేష్, గంధం ప్రభాకర్, కాకిలేటి బాబ్జి, పాఠంశెట్టి రమేష్, సత్తి సోమరాజు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

● ప్రత్తిపాడు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ


స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

ప్రత్తిపాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ బిందుమాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్‌స్టేషన్ పరిసరాలు, భవనాన్ని పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుకు రసీదు ఇచ్చి, చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం రిసెప్షన్ రిజిస్టర్, ఎఫ్ఐఆర్, రిజిస్టర్, ఇతర ముఖ్య రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. మహిళా సంబంధిత కేసులకు సత్వరం స్పందించి న్యాయం చేయాలని, పోలీస్‌స్టేషన్‌లో న్యాయం జరుగుతుందనే మనోధైర్యం కల్పించాలని సూచించారు. సైబర్ నేరాలు, దొంగతనాలు, డ్రగ్స్ వినియోగం, మహిళల రక్షణపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎస్‌ఐ లక్ష్మీకాంతంకు ఆదేశించారు. ఎస్పీ వెంట పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ శ్రీఅప్పారావు, స్టేషన్‌సిబ్బంది ఉన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా : హౌసింగ్ పీడీ


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

జగ్గంపేట, మార్చి18 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నియోజకవర్గ ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ 2025ను పారదర్శకంగా నిర్వహించడంతో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులక తోడ్పాటునందించాలని జిల్లా హౌసింగ్ పీడీ, జగ్గంపేట నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ కోరారు. మంగళవారం జగ్గంపేట తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహశీల్దార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రకాశన, భావితరం ఓట ర్లను గుర్తించుట, పోలింగ్ కేంద్రాల మార్పులు, ఓటర్లపేరులు సవరణలు వంటి అంశాలు క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్ల జాబితా సవరణ చేపట్టాలన్నారు. జగ్గంపేట తహశీల్దార్ జేవీఆర్ రమేష్, గండేపల్లి తహశీల్దార్ శ్రీనివాస్, కిర్లంపూడి తహశీల్దార్ చిరంజీవి, గోకవరం తహశీల్దార్ ఎం. సాయి ప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో ఆర్డీవో, ట్రైనీ కలెక్టర్ పర్యటన

● శిథిలావస్థకు చేరిన తహశీల్దార్ కార్యాలయం పరిశీలన


తహశీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, ట్రైనీ కలెక్టర్

ప్రత్తిపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో శిథిలావస్థకు చేరిన తహశీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం సాయంత్రం పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణ, ట్రైనీ కలెక్టర్ భావన పరిశీలించారు. సుదీర్ఘకాలం సేవలందించిన కార్యాలయం శిథిలావస్థకు చేరి శ్లాబు పెచ్చులు ఊడిపడటం, వర్షం కురిసిన సమయంలో లీకేజీలు కొనసాగడం వంటి పరిస్థితుల్లో ఈ కార్యాలయాన్ని ఖాళీ చేసి వేరే కార్యాలయానికి వెళ్లాలని గతంలో కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఆర్డీవో, ట్రైనీ కలెక్టర్, తహశీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం ప్రత్తిపాడు బస్టాండ్ సమీపంలో నూతనంగా నిర్మించిన సచివాలయ కార్యాలయాన్ని ఎమ్మార్వో కార్యాలయ ఏర్పాటుకు పరిశీలించారు. త్వరలోనే నూతన సచివాలయ భవనానికి తహశీల్దార్ కార్యాలయం మార్పుచేయాలని ఆర్డీవో, ట్రైనీ కలెక్టర్లు తహశీల్దార్‌కు సూచించారు. డిప్యూటీ తహశీల్దార్ పుణ్యవతి, ఆర్ఐ గోపాలకృష్ణ, మండల సర్వేయర్ బషీర్ పాల్గొన్నారు.

'ఆదిత్య'లో డిజైన్ ఫర్ 3డీ ప్రింటింగ్ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్స్

గండేపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలో ఆదిత్య యూనివర్శిటీలో ఆదిత్య లెర్నింగ్ అకాడమీ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిజైన్ ఫర్ 3డీ ప్రింటింగ్ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సు ప్రారంభమైనట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కోర్సు ద్వారా 3డీ ప్రిం టింగ్‌లో ఉపయోగించే ఆధునిక మోడలింగ్, ప్రోటో టైపింగ్ టెక్నిక్, మాన్యుఫాక్చరింగ్ ట్రెండ్స్ రియల్‌టైమ్ అప్లికేషన్ కోసం లోతుగా అవగాహన కల్పించనున్నారు. కోర్సును పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ప్రముఖ మెకానికల్ ఇంజనీరింగ్ నిపుణులు డాక్టర్ ఎస్‌డీవీవీఎస్ భీమేశ్వర్ రెడ్డి, పి.జైకిషన్, వీఎస్ సూర్యప్రకాష్ రిసోర్సు పర్సన్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈనెల 22వరకు ఈ కోర్సు కొనసాగుతుందన్నారు.

గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు : ఎంపీపీ

ఏలేశ్వరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా చేస్తున్నట్లు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. మంగళవారం మండలంలోని తూర్పులక్ష్మీపురం, మర్రివీడు గ్రామాల్లో మండల పరిషత్ నిధుల నుంచి గ్రావెల్‌తో పుంత రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ బుజ్జి, స్థానిక నాయకులు కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేశారు. ఎంపీడీవో సూర్యనారాయణ, ఎంపీటీసీ యిజనగిరి ప్రసాద్, ఉపసర్పంచ్ బూర్లు బాస్, శ్రీకాంత్, సత్యనారాయణ, మంగతాయారు పాల్గొన్నారు.

సాగునీటి బోర్లు సరిగ్గా రాక... ఆందోళనలో రైతులు


ఎండలకు సాగునీటి బోరు నుంచి తగ్గిన నీటి ఉధృతి

గండేపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేసవి పూర్తిగా రాకముందే సాగునీటి బోర్లు నీటి లెవల్ తగ్గి ఉధృతంగా రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్చిలోనే పరిస్థితి ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎండలు తీవ్రత పెరుగుతుందని ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటడంతో నీరు సరిగ్గా రాక వ్యవసాయానికి సరిపోవడంలేదని రైతులు చెప్తున్నారు. సుమారు 300 నుంచి 350అడుగుల లోతుకు పైపులు దింపినప్పటికీ నీరు మాత్రం అంతంత మాత్రంగానే వస్తుందని తెలుపుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే వ్యవసాయానికి నీరందడం కష్టమంటున్నారు. నియోజకవర్గంలో 4600కు పైగా ఈ బోర్లపైనే ఆధారపడి రైతులు వ్యవసాయ సాగు చేస్తున్నారు. ఎండలకు గడ్డుకాలం ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మెరుగైన ఫలితాలు


గిరిజనులు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న గాంధీ

శంఖవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో మెరుగైన ఫలితాలు రావడంతో పాటూ ఖర్చు తక్కువగా అవుతుందని వ్యవసాయాధికారి పి.గాంధీ తెలిపారు. మంగళవారం పెదమల్లాపురంలో గిరిజనులు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటల స్టాల్‌ను ఉద్యానశాఖాధికారి అరుణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. సబ్సిడీ ద్వారా పరికాలు తమకు అందడం లేదని, పంటను ఇతర ప్రాంతాలకు అమ్మాలంటే బస్సు సౌకర్యం లేదని వారు వాపోయారు.

ఆకు కూరలతోనే సంపూర్ణ ఆరోగ్యం

గండేపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ఎరువులతో పండించిన ఆకుకూరలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడీవో నాతి బుజ్జి అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఖాళీస్థలంలో ప్రకృతి ఎరువులతో ఇటీవల పెంచిన తోటకూర, కొత్తమీర, పాలకూర, మెంతికూర తదితర ఆకుకూరలను మండలంలో మురారి గ్రామంలోని 4 అంగన్వాడీ సెంటర్లకు మంగళవారం ఎంపీడీవో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో చంద్రరావు పాల్గొన్నారు.


కొత్త హంగులు దిద్దుకున్న గండేపల్లి ఎంపీడీవో కార్యాలయం

ఎంపీడీవో కార్యాలయం ముస్తాబు

● సీసీ కెమెరాలతో నిఘా

గండేపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రస్తుతం కొత్త హంగులతో ముస్తాబవుతుంది. కార్యాలయ చుట్టుపక్కల 15 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాంపౌండ్ వాల్, పచ్చదనం అందించే మొక్కలు, కొద్దిపాటి ఖాళీ ప్రదేశంలో ఆకుకూరలు పెంచుతూ కార్యాలయాన్ని ఆహ్లాదకరంగా మారుస్తున్నారు. ఎంపీడీవో నాతి బుజ్జి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కార్యాలయంలో ఒక్కొక్కటిగా మారుస్తున్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల దీక్షలు

ఏలేశ్వరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేసిన స్థానిక ఆర్టీసీ డ్రైవర్ ఎస్వీ రమణను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జేఏసీ నేతృత్వంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. మంగళవారం ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ యూనియన్ సభ్యులు సంయుక్తంగా డిపో గేటు వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎర్ర రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. యూనియన్ డిపో కార్యదర్శి యుబిఎం.కుమార్, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎస్‌పి రావు, త్రిమూర్తులు, కార్మికులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తికి ఆరు నెలలు జైలు

తుని రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): హంసవరం గ్రామానికి చెందిన మాస సింహాచలం అనే వ్యక్తి మద్దుల సూత్రామని అనే మహిళపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనపై ఆరు నెలలు జైల శిక్షను విధిస్తూ తుని కోర్టు తుది తీర్పు వెల్లడించింది. సీఐ చెన్న కేశవరావు, ఎస్ఐ కృష్ణమాచార్యులు కోర్టు కానిస్టేబుల్ సాక్షులను ప్రవేశపెట్టగా ఏపీపీ లక్ష్మీదేవి ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు.

కార్మికుల వేతనాలు తక్షణమే చెల్లించాలి

ఏలేశ్వరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): క్వారీ యాజమాన్యం తక్షణం స్పందించి క్వారీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మంగళవారం క్వారీ యాజమానులు పెంటకోట మోహన్, కోరాడ రాము, కొమిరి పోలు రాజులతో క్వారీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కుప్పుల నాగభూషణం చర్చలు జరిపారు. అగ్రిమెంటు గడువు ముగిసినందున వెంటనే వేతనాలు చెల్లించాలని కోరారు. యాజమాన్య సభ్యులు మాట్లాడుతూ 2, 3 రోజుల్లో క్వారీ, క్రషర్ల యాజమాన్యంతో మాట్లాడి కొత్త అగ్రిమెంటు చేసుకుందామన్నారు.

జగ్గంపేట డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

జగ్గంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీకళాశాల జగ్గంపేటలో ఉద్యోగ మేళా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. వరుణ్ మోటార్స్ ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, డైకిన్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, బజాజ్‌ఫైనాన్స్, మెడప్లస్ వంటి ప్రముఖ సంస్థలు ఉద్యో గావకాశాలు అందించాయి. కళాశాల స్కిల్ హబ్ కోఆర్డినేటర్ జి.శ్రీని వాస్ ఆధ్వర్యంలో నిర్వహించగా మొత్తం 63మంది విద్యార్థులు హాజ రవ్వగా వారిలో 28 మంది నియామక పత్రాలను పొందారు. ప్రిన్సిపాల్ చెన్నారావు, ఏపీఎస్‌ఎస్‌డీసీ మేనేజర్ ఎం.కొండలరావు, ఐ క్యూఏసీ కోఆర్డినేటర్ పీవీవీ సత్యనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ విశ్వేశ్వరరావు, అధ్యాపకులు మల్లికార్జున శర్మ, సత్యలత, గోపాలకృష్ణ, పి. పద్మశేఖర్, కె.వెంకట్రావు,ఆర్.శ్రీను, పి.శ్రీనివాస్, పి.నవీన్ వి.దేవి పాల్గొన్నారు.

తుని పోలీస్‌స్టేషన్‌కు డ్రోన్ కెమెరా

తునిరూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తుని పట్టణ పోలీస్‌స్టేషన్ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అత్యాధునిక డ్రోన్ కెమెరాను కేటాయించారు. దీన్ని సీఐ గీతారామకృష్ణ మంగళవారం ప్రారంభించారు. డ్రోన్ కెమెరా వినియోగంతో మారుమూల ప్రాంతాలు, నిర్మానుష ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిని గుర్తించడానికి వీలు ఉంటుందన్నారు. డ్రోన్ కెమెరాను బందోబస్తు సమయంలో, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకువాడతామని తెలిపారు.

భవిత సెంటర్ పరిశీలన


భవిత సెంటర్ లో రికార్డులు పరిశీలిస్తున్న నాగేశ్వర్రావు.

తొండంగి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఐఈఆర్టీ జిల్లా కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వర్రావు మంగళవారం తొండంగి భవిత సెంటర్‌ను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందుతున్న సౌకార్యాలను పరిశీలించారు. వారి నైపుణ్యాలను పరీక్షించారు. రికార్డులు తనిఖీ చేసి అసంపూర్తిగా ఉన్న వాటిని అప్‌టుడేట్ చేయమని ఆదేశించారు. ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు గల పిల్లల సంక్షేమానికి అత్య ధిక ప్రాధాన్యత ఇస్తున్నందున నిర్వాహకులు, బోధకులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

'ప్రగతి'లో ముగిసిన వర్క్‌షాప్

గండేపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో మోడల్ డిజైన్ అండ్ అనాలసిస్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ యూజింగ్ మేట్ లాబ్ సిమ్యులేషన్ అనే అంశంపై 2రోజుల వర్క్‌షాప్ ముగిసిందని కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం, శ్రీముద్ర టెక్నో ప్రైవేట్ లిమిటెడ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాప్‌కి శ్రీ ముద్ర టెక్నో ప్రైవేట్ లిమిటెడ్ జి.శరత్‌చంద్ర విచ్చేశారు. సుమారు 150కిపైగా విద్యార్థులు పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ జి.నరేష్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కె.దుర్గాప్రసాద్ తెలిపారు.

బోనాల ఊరేగింపు

జగ్గంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట సంత మార్కెట్ వద్ద వెలసిన సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలు సందర్భంగా గ్రామంలోని మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని ఆలయం నుంచి బయలుదేరి గ్రామమంతా తిరిగారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.